మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 25-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 296 Issue: 296

25 ఏప్రిల్ 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:57 సూర్యాస్తమయం - సా. 6:31 తిథి నవమి సా. 6:32 వరకు తరువాత దశమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం ఆశ్లేష రా. 8:05 వరకు తరువాత మఖ యోగం గండ రా. 11:43 వరకు కరణం భాలవ ఉ. 6:51 వరకు కౌలవ సా. 6:32 వరకు వర్జ్యం ఉ. 8:57 నుండి ఉ. 10:32 వరకు దుర్ముహూర్తం ఉ. 7:37 నుండి ఉ. 8:28 వరకు రాహుకాలం ఉ. 9:05 నుండి ఉ. 10:40 వరకు యమగండం మ. 1:48 నుండి మ. 3:22 వరకు గుళికాకాలం తె. 5:57 నుండి ఉ. 7:31 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:21 నుండి తె. 5:09 వరకు అమృత ఘడియలు సా. 6:28 నుండి రా. 8:03 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:39 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

# డ్రైవర్ శంకరన్న ఇక లేరు

## నర్సంపేట డ్రైవర్ మృతి.. తీవ్ర ఉద్రిక్తత.. అంత్యక్రియలు పూర్తి

వరంగల్ జిల్లాలోని నర్సంపేటలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ ప్రాణాలు వదిలారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శంకర్ గౌడ్ మృతిపై ఆర్టీసీ కార్మికులు భగ్గుమన్నారు.



నర్సంపేట, ఏప్రిల్ 24 (ఈవార్తలు): నర్సంపేట మండలం ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపో వరకు తీసుకెళ్లేందుకు కార్మికులు యత్నించారు. నర్సంపేట డిపో వద్ద మృతదేహానికి నివాళులర్పిస్తామని చెప్పారు. అందుకు పోలీసులు అంగీకరించలేదు. మృతదేహాన్ని తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, కార్మికులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా కార్మికులు నినాదాలు చేశారు. శంకర్‌గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డిపో వద్దకు అనుమతించకుంటే అంత్యక్రియలు చేయబోమని శంకర్‌గౌడ్ కుటుంబసభ్యులు హెచ్చరించారు. అదే సమయంలో తన వాహనంలో భౌతికకాయాన్ని తీసుకెళ్లేందుకు బండి సంజయ్ తరువాయి 2 వ పేజీలో...




# కవిత 'పొలి' కేక!

## నేడే కొత్త రాజకీయ పార్టీ ప్రారంభం

### పార్టీ ప్రకటన సభకు అట్టహాసంగా ఏర్పాట్లు

### సర్వాంగసుందరంగా మునీరాబాద్ ముస్తాబు

### గన్‌పార్క్‌లో అమరులకు నివాళి అర్పించి సభకు కవిత

### 33 జిల్లాల నుంచి తరలిరానున్న వేల మంది కార్యకర్తలు

మేడ్చల్/హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయ పార్టీ ప్రకటనకు సర్వం సిద్ధమైంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్ లోని అద్వయ కన్వెన్షన్ (ప్రొఫెసర్ జయశంకర్ సార్ ప్రాంగణం) తెలంగాణ రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించడానికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రెండు దశాబ్దాల క్రితం తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో సంస్కృతిక విప్లవానికి ఊతకర్తగా నిలుస్తూ తెలంగాణ జాగృతిని స్థాపించిన కల్వకుంట్ల కవిత 20 ఏళ్ల తన ప్రజా జీవితంలో ఎన్నో మైలు రాళ్లను చేరుకున్నారు.. మరెన్నో ఇబ్బందులను తరువాయి 2 వ పేజీలో...

"తెలంగాణ అస్తిత్వాన్ని ప్రతిబింబించేలా పేర్లు

- **సభ ప్రాంగణం పేరు:** ప్రొఫెసర్ జయశంకర్ సార్ సభా ప్రాంగణం
- **ప్రధాన ద్వారం :** ప్రజాకవి కాళోజీ నారాయణ రావు ద్వారం
- **ఇతర ద్వారాల పేర్లు:** రాణి రుద్రమ దేవి ద్వారం, మారోజు వీరన్న ద్వారం, చాకలి ఐలమ్మ ద్వారం
- **భోజనశాలల పేర్లు:** సురవరం ప్రతాపరెడ్డి భోజనశాల, సమ్మక్క సారలమ్ భోజనశాల, షోయబుల్లా ఖాన్ (మీడియా) భోజనశాల"



# ఆర్టీసీ విలీనం..!

## జూన్ 2 నుంచి కసరత్తు షురూ



### ప్రభుత్వం-ఆర్టీసీ చర్చలు సఫలం

### సమ్మె విరమించిన కార్మికులు

### నేటి నుంచి రోడ్డెక్కనున్న బస్సులు

తెలంగాణ సచివాలయంలో ఆర్టీసీ యూనియన్స్, ప్రభుత్వానికి మధ్య జరిగిన చర్చలు సఫలం అయ్యాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఉప కమిటీతో జరిగిన చర్చల్లో ఆర్టీసీ కార్మికుల డిమాండ్స్‌కు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. మంత్రుల బృందం, ఆర్టీసీ జేఏసీ నేతల మధ్య దాదాపు 12 గంటల పాటు చర్చలు జరిగాయి. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 డిమాండ్లపై ప్రధానంగా తరువాయి 2 వ పేజీలో...



# మిలియన్ మార్చ్ కేసులు కొట్టివేత

### కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌కు భారీ ఊరట

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. 2011లో హైదరాబాద్ ఓలోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన మిలియన్ మార్చ్‌కు సంబంధించి నమోదైన కేసులను హైకోర్టు కొట్టివేసింది. నాడు ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన మిలియన్ మార్చ్‌లో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,404 |
| వెండి (గ్రాము): | రూ.265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,214 |



# విజయసాయిరెడ్డి కొత్త పార్టీ

## ఈడీ రైడ్స్ అనంతరం ప్రకటన

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ, ఆ పార్టీ సీనియర్ నాయకుడు విజయసాయిరెడ్డి నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు చేపట్టిన సోదాలు ముగిశాయి. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం ఉదయం ప్రారంభమైన ఈ తనిఖీలు సుమారు 13 గంటల పాటు అత్యంత సుదీర్ఘంగా, క్షుణ్ణంగా కొనసాగాయి.

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): మద్యం పాలసీలో జరిగిన అక్రమాలు, నగదు మళ్లింపు ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు జరిగినట్లు తెలుస్తోంది. సోదాలు ముగిసిన అనంతరం విజయసాయిరెడ్డి తన నివాసం వద్ద మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తన ఇంట్లో నిర్వహించిన తనిఖీల్లో అధికారులకు అక్రమంగా ఉన్న ఒక్క రూపాయి కూడా దొరకలేదని ఆయన స్పష్టం చేశారు. "నా ఇంట్లో ఈడీ అధికారులకు ఏమీ లభించలేదు. వారు అడిగిన ప్రతి ప్రశ్నకూ నేను చాలా ఓపికగా, స్పష్టంగా సమాధానాలు ఇచ్చాను. దర్యాప్తు సంస్థలకు నేను పూర్తిస్థాయిలో సహకరించాను" అని ఆయన -2 వ పేజీలో...



# కొత్త డీజీపీ సీవీ ఆనంద్?

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): తెలంగాణ నూతన డీజీపీగా సీవీ ఆనంద్‌ను నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 30న ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవీ విరమణ చేయనున్నారు. ఆ తర్వాత సీవీ ఆనంద్ మే మొదటి వారంలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీవీ ఆనంద్ ఉన్నారు. శుక్రవారం జరిగిన బదిలీల్లో ఆ స్థానంలో శిఖా గోయల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సీవీ ఆనంద్ కొత్త డీజీపీ అవుతారని హింట్ ఇచ్చినట్లైంది.

# ఏడుగురు ఐపీఎస్‌లు బదిలీ



హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): రాష్ట్రంలో ఏడుగురు ఐపీఎస్‌లను బదిలీలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది . సీనియర్ ఐపీఎస్‌లు శిఖాగోయల్, దేవేంద్ర సింగ్ చౌహాన్, షాహనాజ్ ఖాసీం, డాక్టర్ తరుణ్ జోషి, అవినాష్ మోహంతి, బీ సుమతి, కార్తికేయను బదిలీ చేసింది. విజిలెన్స్ ఎన్‌పోర్స్‌మెంట్‌లో డీజీగా ఉన్న శిఖా గోయల్‌ను పోలీస్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ చేస్తూ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది. అడిషనల్ డీజీపీగా పనిచేస్తున్న దేవేంద్ర సింగ్ చౌహాన్‌ను విజిలెన్స్ ఎన్‌పోర్స్‌మెంట్‌లో డీజీగా బదిలీ చేసింది. డ్రగ్స్ కంట్రోల్ డీజీగా పనిచేస్తున్న షాహనాజ్ ఖాసీంను మల్టీజోన్ -2 ఐజీపీగా నియమించింది, ఏసీబీలో డైరెక్టర్‌గా పనిచేస్తున్న తరుణ్ జోషిని ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్‌గా , ఎస్ఐబీ ఐజీపీ గా పనిచేస్తున్న సుమతిని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా, ఇంటెలిజెన్స్‌లో ఐజీ గా పనిచేస్తున్న కార్తికేయను అదే విభాగంలో పూర్తిస్థా ఐజీపీగా నియమించింది.

## విశ్వవాణి



వాటర్ పార్కుల్లో డాల్ఫిన్లను బంధించడంపై మెక్సికో నిషేధం విధించింది. ప్రేక్షకుల ఆనందం కోసం వాటి ఆనందాన్ని కాలరాయడం సరికాదని ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో తాజాగా, దాదాపు 350 డాల్ఫిన్లను నిర్వాహకులు సముద్రంలో వదిలేశారు.

Paytm

# బ్యాంక్ లైసెన్స్ రద్దు

## ఆర్బీఐ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రముఖ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కార్యకలాపాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం శుక్రవారం నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. పేటీఎం పేమెంట్ బ్యాంక్‌లో డిపాజిటర్ల ప్రయోజనాలకు హాని కలిగించే రీతిలో వ్యాపారం జరిగిందని ఆర్బీఐ పేర్కొంది. తమకు జారీ చేసిన పేమెంట్స్ బ్యాంక్ లైసెన్సులోని నిబంధనలను పాటించడంలో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ విఫలమైందని స్పష్టం చేసింది. ఈ మేరకు బ్యాంక్ లైసెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్ రద్దుపై హైకోర్టులో దరఖాస్తు చేస్తామని సంస్థ వెల్లడించింది. ఆర్బీఐ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం, పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్‌కు ఇచ్చిన బ్యాంకింగ్ లైసెన్స్‌ను తరువాయి 2 వ పేజీలో...

# చద్దా.. బీజేపీ వద్దకు!

## ఆప్ రాజ్యసభ పక్షం బీజేపీలో విలీనం

### ఎంపీ రాఘవ్ చద్దా సంచలన ప్రకటన

### తోడుగా మరో ఆరుగురు ఆప్ ఎంపీలు



ఆప్ రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా పార్టీని వీడి కేంద్రంలో అధికారంలో ఉన్న కాషాయ పార్టీతో జట్టుకడుతున్నట్టు అధికారికంగా ప్రకటించారు. తనతో పాటు ఆరుగురు ఆప్ ఎంపీలు కూడా బీజేపీ గూటికి వస్తున్నారంటూ బాంబు పేల్చారు. రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ పక్షాన్ని బీజేపీలో విలీనం చేస్తున్నట్టు వెల్లడించి రాజకీయ ప్రకంపనలు రేపారు.

న్యూఢిల్లీ, చండీగఢ్: గోడ దూకుతున్న ఎంపీల్లో మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్, స్వాతి మల్లివాల్, సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్, రాజిందర్ గుప్తా, విక్రమ్‌జీత్ సింగ్ సాహ్నీ ఉన్నారు. కొంత కాలంగా సొంత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న రాఘవ్ చద్దా.. కేంద్రంలోని మోదీ సర్కారుపై మెతకవైఖరి అవలంభిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పలు అంశాల్లో ఎన్డీయే సర్కారు తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

25.4.2026

మేషం: సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి. అవసరానికి ఆర్థిక సహాయం అందుతుంది. నూతన వాహనం కొనుగోలు ప్రయత్నాలు కలసివస్తాయి. నూతన వ్యక్తులతో పరిచయాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

వృషభం: చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు అంతగా కలసిరావు. వృధా ఖర్చు విషయంలో పునరాలోచన చెయ్యడం మంచిది. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వృత్తి ఉద్యోగములలో అధికారులతో చికాకులు తప్పవు. నిరుద్యోగుల యత్నాలు మందగిస్తాయి.

మిధునం: కుటుంబ సభ్యుల ధన సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారుల పదోన్నతులు పెరుగుతాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభించి అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. వ్యాపారపరంగా భాగాస్తులతో చర్చలు అనుకూలిస్తాయి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశములు లభిస్తాయి.

కర్కాటకం: దూర ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. పెద్దల ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు. ఇంటా బయట గందరగోళ వాతావరణం ఉంటుంది. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలుంటాయి. స్థిరాస్తి క్రయవిక్రయాలలో ఆశించిన లాభాలు ఉండవు. ఆర్థికంగా కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి.

సింహం: గృహంలో వివాహది శుభకార్యాలు నిర్వహిస్తారు. వ్యాపార ఉద్యోగాలు అభివృద్ధి బాటలో సాగుతాయి. సమాజంలో ప్రముఖులతో నూతన పరిచయాలు పెరుగుతాయి. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. రాజకీయ సంబంధ సమావేశాలకు ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపార ప్రారంభానికి పెట్టుబడులు సమాకూరుతాయి.

కన్య: పాత మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలలో కుటుంబ పెద్దల సలహాలు తీసుకోవడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో ఉన్నత అధికారులతో సఖ్యత కలుగుతుంది. వ్యాపారాల్లో ఆశించిన లాభాలు పొందుతారు. నిరుద్యోగులకు ప్రయత్నాలు ఫలిస్తాయి.

తుల: దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఇంటాబయటా సమస్యలు అధికమవుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలలో మరింత కష్టపడాలి. పాత ఋణాల ఒత్తిడి వలన నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ఉద్యోగస్తులకు అదనపు పనిభారం ఉంటుంది.

వృశ్చికం: కుటుంబ వ్యవహారాలలో ఆకస్మికంగా నిర్ణయాలు మార్పులు చేస్తారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన పనులలో జాప్యం కలిగినా నిదానంగా పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ విషయంలో తొందరపాటు నిర్ణయాలు చేయటం మంచిది కాదు.

ధనస్సు: గృహమున విందు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. చాలాకాలంగా వేధిస్తున్న సమస్య నుండి కొంతవరకు బయట పడతారు. కుటుంబ సభ్యుల సహాయంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. వ్యాపారమున అనుకూల వాతావరణం ఉంటుంది. ఉద్యోగంలో ఉన్నత పదవులు పొందుతారు.

మకరం: నిరుద్యోగుల శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. వృత్తి వ్యాపారాలలో పెట్టుబడుల విషయంలో అంచనాలు అందుకుంటారు. నూతన గృహ వాహన యోగం ఉన్నది. బంధు మిత్రులతో కీలక విషయాల గురించి చర్చిస్తారు. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా సాగుతుంది. ఆర్థికంగా పురోగతి కలుగుతుంది.

కుంభం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. రావలసిన డబ్బు సకాలంలో చేతికి అందక నిరాశ పడతారు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. చేపట్టిన వ్యవహారాల్లో తొందరపాటు నిర్ణయాలు చేసి ఇబ్బందులు ఎదుర్కొంటారు. వ్యాపార ఉద్యోగాలలో కొంత ప్రతికూల వాతావరణం ఉంటుంది.

మీనం: నూతన వ్యాపార ప్రారంభానికి ఆటంకాలుంటాయి. కుటుంబ విషయాలలో స్థిరత్వం లేని ఆలోచనల వలన మాట పట్టింపులు కలుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వెయ్యడం మంచిది. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. నూతన ఋణాలు చేయకపోవడం మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు నత్తనడకన సాగుతాయి.






# కవిత 'పొలి' కేక!

**మొదటి పేజీ తరువాయి**

ఎదుర్కొన్నారు. తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం స్వీయ రాజకీయ శక్తికి నేడు కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నారు. మునీరాబాద్ లోని అద్వయ కన్వెన్షన్ సెంటర్ తో పాటు దానిని ఆనుకునే ఉన్న 20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ సభా ప్రాంగణం నుంచి కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్నారు. శనివారం ఉదయం 7.30 గంటలకు బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి ర్యాలీగా అమరవీరుల స్తూపానికి బయల్దేరుతారు. ఉదయం 8.15 గంటలకు అమరవీరుల స్తూపం వద్ద అమరులకు నివాళులర్పిస్తారు. ఉదయం 8.25 గంటలకు అమరవీరుల స్తూపం వద్ద నుంచి బయల్దేరుతారు. ఉదయం 9.30 గంటలకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్ హాల్ మెయిన్ గేట్ వద్దకు చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు పార్టీ జెండాను కల్వకుంట్ల కవిత ఆవిష్కరిస్తారు. ఉదయం 10.05 గంటల ప్రసంగం ప్రారంభిస్తారు. దాదాపున గంటన్నర పాటు ప్రసంగించి, తెలంగాణ భవిష్యత్తు ముఖ చిత్రంపై క్లారిటీ ఇవ్వనున్నారు.

### తెలంగాణ రుచులతో 34 రకాల వంటకాలు:

**ప్రకటన అనంతరం కార్యకర్తలు, అతిథులకు తెలంగాణ రుచులతో భోజనాలు వడ్డించనున్నారు. మధ్యాహ్న భోజనం కోసం 34 రకాల వంటకాలను సిద్ధం చేశారు.**

నాన్‌వెజ్: తలకాయ కూర, బోటీ ఫ్రై, తెలంగాణ మటన్ కర్రీ, నాటు కోడి పులుసు, బొమ్మిడాయల పులుసు, హైదరాబాదీ చికెన్ దమ్ బిర్యానీ, మిర్చి కా సాలాన్, ఎగ్ ఇగురు.

వెజ్: బగరా బైంగన్ మసాలా కర్రీ, కందగడ్డ ఫ్రై, పాలకూర, మామిడి పప్పు, ఆలూ టామాటా, చామగడ్డ పులుసు, కట్ చారు.

ఇతర ప్రత్యేక వంటకాలు: మక్క గారెలు, జొన్న రొట్టె, సర్వపిండి, బూరెలు, అరిసెలు, బగరా రైస్, వైట్ రైస్, సాంబర్, రోటి పచ్చడి, దోస, ఆవకాయ, మిర్చి బజ్జి, పచ్చి పులుసు, పాపడ్, పెరుగు, రైతా, మజ్జిగ, రాగి అంబలి, బటర్ స్కాచ్ ఐస్‌క్రీం, షాహీతుక్డా, జిలేబీ



# డ్రైవర్ శంకరన్న ఇక లేరు

**మొదటి పేజీ తరువాయి**

ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు బండిసంజయ్ వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన బండి సంజయ్ పోలీసులే అంత్యక్రియలు చేయండంటూ ఫైర్ అయ్యారు. కుమార్తె ఇంటికి శంకర్ గౌడ్ మృతదేహం తరలించారు.ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తతల నడుమ శంకర్ గౌడ్‌కు కుటుంబసభ్యులు, ఆర్టీసీ ఉద్యోగులు కన్నీటి నివాళి అర్పించారు. ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్ల సాధనకు, కాంగ్రెస్ ప్రభుత్వంలో చలనం తీసుకు వచ్చేందుకు ప్రాణాలు అర్పించిన ఆయనకు వీడ్కోలు పలికేందుకు జనం భారీగా తరలివచ్చారు. శంకర్ గౌడ్ అమర్‌రహే నినాదాలతో.. కళాకారుల ఆటపాటలతో అంతిమయాత్ర సాగింది.

### కునటుంబానికి పరిహారం.. ఉద్యోగం

శంకర్‌గౌడ్ మృతదేహానికి నర్సంపేట ఆర్డీవో ఉమారాణి నివాళులర్పించారు. ప్రభుత్వం తరపున శంకర్ గౌడ్ కుటుంబానికి పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తరుపున రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, మృతుడి కుమారుడికి ఆర్టీసీలో ఉద్యోగం ఇస్తున్నట్లు ప్రకటించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతిరెడ్డి మాధవరెడ్డి రూ.5 లక్షలు ప్రకటించారు.

# పేటీఎం బ్యాంక్ లైసెన్స్ రద్దు

**మొదటి పేజీ తరువాయి**

బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం 1949 లోని సెక్షన్ 22(4) కింద రద్దు చేసింది. ఆంక్షలు విధించడంతో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్‌కి బ్యాంకింగ్ లైసెన్స్ ఇక చెల్లదు. ఇకపై బ్యాంకింగ్ వ్యాపారం (సెక్షన్ 5(ఎ)) లేదా అదనపు వ్యాపారాలు (సెక్షన్ 6) నిర్వహించడానికి వీలు లేదని ఆర్బీఐ స్పష్టం చేసింది. త్వరలోనే ఈ నిర్ణయానికి సంబంధించిన వివరాలు, తదుపరి చర్యలు ప్రకటించనుంది.

# మిలియన్ మార్చ్ కేసులు కొట్టివేత

**మొదటి పేజీ తరువాయి**

నిందితులుగా చేర్చారు. ఈ కేసులో వీరికి ఎలాంటి సంబంధం లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయస్థానం వారిపై నమోదైన కేసులను కొట్టివేసింది.

# విజయసాయిరెడ్డి కొత్త పార్టీ

**మొదటి పేజీ తరువాయి**

వెల్లడించారు. అయితే, ఈ సోదాల్లో లభించిన పత్రాలు లేదా ఇతర సమాచారంపై ఈడీ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయకపోవడం గమనార్హం. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి తన సొంత పార్టీ అయిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీరుపై, జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. పార్టీ పట్ల తనకున్న అసహనాన్ని బహిరంగంగానే వెల్లడిస్తూ, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి సరైన పాఠం నేర్పారని వ్యాఖ్యానించారు. పార్టీ నేతలు ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి, తమ తప్పులను సరిదిద్దుకోవాలని సూచించారు. నాయకులు అహంకారాన్ని వీడి ప్రవర్తిస్తేనే భవిష్యత్తు ఉంటుందని, లేనిపక్షంలో మరింత పతనం తప్పదని ఆయన హెచ్చరించారు. విజయసాయిరెడ్డి చేసిన మరో కీలక ప్రకటన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. జులై నెలలో తాను తిరిగి క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశిస్తానని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించాల్సిన అవసరం ఉందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరిచాయి. ఇది ఆయన సొంతంగా పార్టీ పెట్టబోతున్నారనే సంకేతమా లేక మరేదైనా వ్యూహమా అన్న చర్చ మొదలైంది. రాజకీయాలతో పాటు త్వరలోనే తాను మీడియా రంగంలోకి కూడా అడుగుపెడుతున్నట్లు ఆయన వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచారు. చివరగా, రాష్ట్ర ప్రభుత్వ తీరుపై కూడా ఆయన మండిపడ్డారు. రాజకీయాల్లోకి మళ్ళీ వచ్చాక చంద్రబాబు అవినీతి బాగోతాన్ని సాక్ష్యాధారాలతో సహా ఎండగడతానని సవాల్ విసిరారు. చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న దుష్ట రాజకీయాల అంతు చూస్తానని ఆయన హెచ్చరించారు. ఒకవైపు ఈడీ విచారణను ఎదుర్కొంటూనే, మరోవైపు తన సొంత పార్టీ అధినాయకత్వంపై తిరుగుబావుటా ఎగురవేయడం ఏపీ రాజకీయాల్లో ఒక కొత్త సమీకరణానికి దారితీస్తోంది. విజయసాయిరెడ్డి తదుపరి అడుగులు ఎటువైపు ఉంటాయోనని రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.



# ఆర్టీసీ విలీనం..!

**మొదటి పేజీ తరువాయి**

చర్చ జరిగింది. ఇందులో భాగంగా.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు సర్కారు ఓకే చెప్పింది. చర్చల అనంతరం మంత్రుల బృందం మీడియాతో మాట్లాడింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 'ఆర్టీసీ మన కుటుంబం.. మన కుటుంబ వ్యక్తి దూరం కావడం బాధాకరం. ప్రజా పాలన ప్రభుత్వం వారి సమస్యల పై చర్చించి సానుకూల నిర్ణయాలు తీసుకున్నది. ఆర్టీసీ గుర్తింపు ఎన్నికలు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఎన్నికల నిర్వహణ కోసం కావాల్సిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆర్టీసీ యాజమాన్యాన్ని ఆదేశించింది. దశాబ్ద కాలంగా పెండింగ్ లో ఉన్న విలీనం పై సుదీర్ఘంగా చర్చించాం' అని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ' భట్టి నాయకత్వంలో మంత్రులు శ్రీధర్ బాబు ,వివేక్ వెంకట్ స్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీఎస్,అధికారుల బృందం ఆర్టీసీ జేఏసీతో చర్చలు జరిపింది. ఉదయం ఐఏఎస్‌లతో చర్చలు జరిపి తరువాత ఉప ముఖ్యమంత్రితో వారి సమస్యలపై చర్చించాం. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు , ఆర్టీసీ యాజమాన్యం తీసుకునే అంశాలపై చర్చించాం. ఆర్టీసీ కార్మికులు సమ్మె ను విరమిస్తున్నట్లు ప్రకటించారు. వారికి ధన్యవాదాలు. భవిష్యత్ లో ఆర్టీసీ సంస్థ దేశంలోనే ప్రజా రవాణా లో ముందుండాలి. ఆర్టీసీ విలీనానికి సంబంధించి అధికారులు, కార్మిక నాయకులతో కలిసి అధికారిక కమిటీని ప్రకటించాం. పీఆర్సీ పై అనేక అంశాలు ఆర్టీసీ ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వ వెసులుబాటు ఇరు పక్షాలు అర్థం చేసుకున్న తరువాత ఆర్టీసీ కార్మికులకు 11 శాతం పీఆర్సీ ప్రకటించింది. మిగతా సమస్యలపై ఆర్టీసీ యాజమాన్యం, కార్మిక సంఘాలు చొరవ తీసుకొని పరిష్కారం చేయాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని ఆదేశించాం' అని పేర్కొన్నారు. ఇక, శనివారం ఉదయం మొదటి షిఫ్ట్ నుంచి ఆర్టీసీ ఉద్యోగులు యథావిధిగా డ్యూటీ ఎక్కనున్నారు.

# చద్దా.. బీజేపీ వద్దకు!

**మొదటి పేజీ తరువాయి**

విధానాలను ఆమ్ ఆద్మీ పార్టీ వ్యతిరేకించినా ఆయన మాత్రం మిన్నకుండిపోయారు. అంతేకాదు పలుమార్లు పార్టీకి ఇబ్బందికర పరిస్థితులను తెచ్చి పెట్టారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు నుంచి ఆప్ అధినేత కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను కోర్టు నిర్దోషులుగా ప్రకటించినా.. చద్దా నుంచి స్పందన కూడా రాలేదు. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ ఉండే ఆయన కనీసం ఒక ట్వీట్ కూడా పెట్టలేదు. పార్లమెంట్‌లో మోదీ సర్కారును ఇబ్బంది పెట్టకుండా నడుచుకున్నారనే అపవాదును సొంత పార్టీ నుంచే ఎదుర్కొన్నారు. కేంద్రం తీసుకున్న వివాదాస్పద అంశాల జోలికి వెళ్లకుండా సాధారణ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించారనే ఆరోపణలూ ఆయనపై ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాజ్యసభలో ఉప నాయకుడి పదవి నుంచి ఇటీవల చద్దాను ఆమ్ ఆద్మీ పార్టీ తొలగించింది. ఆయన స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించింది. అయితే చద్దాతో పాటు మిట్టల్ కూడా ఇప్పుడు కాషాయ పార్టీలోకి జంప్ కావడం గమనార్హం. రాఘవ్ చద్దా.. ఆమ్ ఆద్మీ పార్టీకి గుడ్ బై చెబుతారని కొద్ది రోజులుగా వార్తలు వస్తున్నాయి. రాజ్యసభలో పార్టీ డిప్యూటీ లీడర్ పదవి నుంచి తొలగించడం, తనకు ఇచ్చిన జడ్ ప్లస్ భద్రతను పంజాబ్ ప్రభుత్వం ఉపసంహరించుకోవడంతో కమలం గూటికి చద్దా చేరతారనే వార్తలు వచ్చాయి. అయితే ఎవరూ ఊహించని విధంగా ఏకంగా తనతో పాటు ఆరుగురు ఎంపీలను పార్టీని వీడేలా చేసి రాజకీయాల్లో ప్రకంపనలు రేపారు. రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ పక్షాన్ని బీజేపీలో కలిపేసి కేజ్రీవాల్‌కు షాక్ ఇచ్చారు. మరోవైపు, పార్టీ ఫిరాయింపును ఎంపీ రాఘవ్ చద్దా సమర్థించుకున్నారు. తాను ఆమ్ ఆద్మీ పార్టీకి దూరమై ప్రజలకు చేరువుతున్నానని చెప్పుకొచ్చారు. మరోవైపు కేంద్ర కేబినెట్‌లో చద్దాకు చోటు కల్పించేందుకు రంగం సిద్ధమైందన్న ఊహాగానాలు వెలువడుతున్నాయి. పశ్చిమ బెంగాల్ రెండో దశ ఎన్నికల పోలింగ్‌కు నాలుగు రోజుల ముందు ఈ పరిణామం చోటుచేసుకోవడం రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. పంజాబ్‌లో వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నట్టుగా కనిపిస్తోంది. ఇందులో భాగంగానే ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీలను తమవైపు తిప్పుకుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఢిల్లీలో ఆప్‌ను దెబ్బకొట్టిన కమలం పార్టీ.. పంజాబ్‌లోనూ కేజ్రీవాల్‌కు చెక్ పెట్టాలని వ్యూహరచన చేస్తోందని చెబుతున్నారు. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో రాఘవ చద్దాను సీఎం అభ్యర్థిగా ప్రకటించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని విశ్లేషకులు అంటున్నారు.

# హెచ్‌సీఏ.. సిట్

**అసోసియేషన్ కార్యకలాపాలపై సిట్**
**అడిషనల్ కమిషనర్ నేతృత్వం**
**క్రికెట్ వ్యవహారాలకు అపెక్స్ కౌన్సిల్**
**తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు**

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో పరిపాలనా వ్యవహారాలు, నిర్వహణ, ఆర్థిక అవకతవకలపై సీబీసీఐడీ విభాగంలోని సిట్‌తో దర్యాప్తు జరిపించాలని హైకోర్టు ఆదేశించింది. ఐపీఎస్ హోదాలోని అదనపు పోలీసు కమిషనర్ సిట్‌కు నేతృత్వం వహించాలని తెలిపింది. హెచ్‌సీఏ కార్యకలాపాలపై కేసు నమోదు చేసి పరిపాలన, నిర్వహణ, ఆర్థిక వ్యవహారాలపై దర్యాప్తు చేపట్టాలని శుక్రవారం ఆదేశించింది. ప్రస్తుత కమిటీ అందుబాటులో ఉన్న రికార్డులను, జస్టిస్ అనిల్ ఆర్ దవే, జస్టిస్ జీవీ సీతాపతి, జస్టిస్ నిసార్‌అహ్మద్ కక్రూ, జస్టిస్ నవీన్‌రావు ఇచ్చిన నివేదికలతో సహా అన్ని రికార్డులను సిట్ స్వాధీనం చేసుకోవచ్చని తెలిపింది. రాష్ట్ర ఏజెన్సీలు, హెచ్‌సీఏ కార్యనిర్వాహకులు, అధికారులు, ఉద్యోగులు సిట్‌కు సహకరించి, అవసరమైన సమాచారం అందజేయాలని ఆదేశించారు. అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ ఏకసభ్య కమిటీ జస్టిస్ పీ నవీన్‌రావు నేతృత్వంలో పనిచేయాలని ఆదేశించింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌ను బీసీసీఐ స్వాధీనం చేసుకోవాలని, ఆర్థిక అవకతవకలపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని, 2025లో జరిగిన సమావేశాన్ని రద్దు చేయాలని కోరుతూ సఫిల్‌గూడ క్రికెట్ క్లబ్ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. దీనిపై విచారించిన జస్టిస్ నగేశ్ భీమపాక శుక్రవారం తీర్పు వెలువరిస్తూ హెచ్‌సీఏలో గత కొన్నేండ్లుగా జరుగుతున్న అవకతవకలకు ఒక తారిక ముగింపునివ్వాల్సిన అవసరం ఉందని, ఈ వ్యవహారాలపై సీఐడీతో ప్రత్యేక దర్యాప్తు అవసరమని భావిస్తున్నామని చెప్పారు. దర్యాప్తునకు ఆదేశించినంత మాత్రాన తప్పు చేశారనిగానీ, చేయలేదనిగానీ ఎలాంటి అభిప్రాయాన్ని ఈ కోర్టు వ్యక్తం చేయడంలేదని స్పష్టంచేశారు. ఇది అనుమానాలను నివృత్తి చేసి చట్టబద్ధ వ్యవస్థగా కొనసాగించడానికి చేపట్టే ఒక విధానపరమైన అడుగుగా పేరొన్నారు. క్రికెట్‌కు సంబంధించిన విషయాలు లీగ్ మ్యాచ్‌ల నిర్వహణ, ఆటగాళ్ల ఎంపికలో అక్రమాలపై ఆరోపణలున్న నేపథ్యంలో 2024-25, 2025-26 క్రికెట్ లీగ్ మ్యాచ్‌ల నిర్వహణను పర్యవేక్షించడానికి జస్టిస్ నవీన్‌రావును ఈ కోర్టు నియమించిందని తెలిపారు. ఆయన హయాంలో 1500కు పైగా మ్యాచ్‌లు జరిగాయని, వివిధ టోర్నమెంట్‌లలో జట్ల ప్రదర్శన గణనీయంగా మెరుగుపడిందని అన్నారు. జాతీయ స్థాయిలో రాష్ట్రం రెండు టైటిళ్లను గెలుపొందిందని తెలిపారు. ఏకసభ్య కమిటీ నియామకం ఫలితాన్నిచ్చిందని, ఆయనకు స్వేచ్ఛ కల్పించినట్లయితే క్రికెట్ ప్రమాణాలు మెరుగుపడడం కొనసాగుతుందని అభిప్రాయపడ్డారు. దుర్వినియోగాలను అడ్డుకోవడానికి వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సి ఉన్నదని, అందువల్ల దర్యాప్తు పూర్తయి, కోర్టు నిర్ణయం వెలువరించేదాకా అపెక్స్ కౌన్సిల్ ద్వారా క్రికెట్ వ్యవహారాలు జస్టిస్ నవీన్‌రావు పర్యవేక్షణలో కొనసాగాలని ఆదేశించారు. క్రికెట్‌కు సంబంధించి అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు ఏకసభ్య కమిటీకి పూర్తి అధికారం ఉన్నదని తేల్చి చెప్పారు. అన్ని స్థాయిల్లో, క్యాటగిరీల్లో మెన్, ఉమెన్ లీగ్ నిర్వహణ, రాష్ట్ర, జోనల్, ఇతర జట్ల ఆటగాళ్ల ఎంపిక ప్రక్రియను క్రమబద్ధీకరించడం, కోచ్‌లు, సెలెక్టర్లు, సపోర్టు సిబ్బంది, సాంకేతిక సిబ్బంది, అన్నింటిపై జస్టిస్ నవీన్‌రావు స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేశారు. ఏకసభ్య కమిటీ సభ్యులుగా జస్టిస్ నవీన్‌రావుకు రూ.5 లక్షల వేతనం చెల్లించాలని ఆదేశిస్తూ తీర్పు వెలువరించారు.

## బీఆర్‌ఎస్ ఆత్మ మారింది: కవిత



హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం పాతిక సంవత్సరాల క్రితం బీఆర్‌ఎస్ పుట్టిందని, కానీ గత కొన్నేళ్లుగా ఆ పార్టీ తన పేరుతో పాటు పనితీరును, పార్టీ ఆత్మను కూడా మార్చుకుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. రేపు కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్న నేపథ్యంలో ఈరోజు ఆమె మీడియాతో మాట్లాడారు. పేరు మార్పు మొదలు ప్రతి విషయంలో టీఆర్‌ఎస్ మారిందని, దీనితో ఆ పార్టీకి ప్రజలతో ఉన్న పేగుబంధం తెగిపోయిందని అన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా తన ప్రాథమిక ఉద్దేశం, మూల సిద్ధాంతం నుంచి పక్కకు తప్పుకుంటే ఆ పార్టీ ఎక్కువ కాలం మనుగడ సాగించలేదని అన్నారు. బీఆర్‌ఎస్ తన ప్రాథమిక ఉద్దేశం నుంచి పక్కకు తప్పుకోవడం వల్ల ఆ పార్టీకి ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం మారినా తెలంగాణలో ఎన్నో సమస్యలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆంక్షలు ఇంకా మిగిలే ఉన్నాయని అన్నారు. వీటిని సాధించడమే తాను ప్రారంభించబోయే పార్టీ ప్రధాన ఉద్దేశమని అన్నారు. ప్రజల కోసం పని చేసే స్వచ్ఛమైన ప్రాంతీయ పార్టీ అవసరం ఇప్పుడు తెలంగాణకు ఉందని అన్నారు.

## రైతు భరోసా లేక బోనస్

**ఏదో ఒకటి ఎంచుకోవాలి.. చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**



హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): తెలంగాణ రైతు సంక్షేమ పథకాలపై శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న బహుళ పథకాల వల్ల నిధుల నిర్వహణ కష్టతరమవుతోందని, దీనివల్ల రైతుల్లో అసంతృప్తి పెరుగుతోందని గుత్తా సుఖేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రైతు భరోసాతో పాటు పంటలకు బోనస్ ఇవ్వడం వల్ల ప్రభుత్వంపై మోయలేని భారం పడుతోందని పేర్కొన్నారు. కేవలం బోనస్ కోసమే సుమారు రూ. 2 వేల కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోందని గుర్తు చేశారు. ఒకవైపు రైతు భరోసా నిధులు అందలేదని రైతులు అసంతృప్తితో ఉన్నారని, మరోవైపు పథకాల అమలులో జాప్యం జరుగుతోందని వ్యాఖ్యానించారు. రైతు భరోసా లేదా పంటల బోనస్.. ఈ రెండింటిలో ఏదో ఒకటి ఎంచుకుని దానిని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఏదో ఒకదానిపై ప్రభుత్వం త్వరగా స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని కోరారు.



## బీజేపీలో చేరను

**మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి**

నాంపల్లి-హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): తాను బీజేపీలో చేరడం లేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆమె నాంపల్లిలోని బీజేపీ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. ఆమె బీజేపీ కార్యాలయానికి వెళ్లడం రాజకీయాల్లో చర్చనీయాంశమైం ది. ఆమె పార్టీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారితో సమావేశమయ్యారు. ఈ భేటీపై ఆమె మీడియాతో మాట్లాడుతూ, తమ భేటీకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదని స్పష్టం చేశారు. తాను బీజేపీలో చేరడం లేదని స్పష్టం చేశారు. తాను విద్యావేత్తనని గుర్తుంచుకోవాలని అన్నారు. తాను అన్ని పార్టీలను కలుస్తానని అన్నారు. డిజిటల్ ఇండియా కోసం అన్ని పార్టీల నేతలను కలుస్తున్నట్లు ఆమె తెలిపారు. మల్లారెడ్డి యూనివర్సిటీలో ఏఐ క్యాంపస్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించినట్లు తెలిపారు.

## శంకర్ గౌడ్ ది ఆత్మహత్య కాదు

**రేవంత్ సర్కార్ చేసిన హత్య: కేటీఆర్**



హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): నర్సంపేట ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన 'హత్య' అని ఆయన అన్నారు. శంకర్ గౌడ్ పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. అరెస్టు చేసిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సహా కార్మిక నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు ఆత్మహత్యాయత్నం చేయడం తెలంగాణ చరిత్రలో ఒక 'చీకటి రోజు' అని, అయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఆర్టీసీ కార్మికులు ఎవరూ అధైర్యపడవద్దని, బీఆర్‌ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని, ప్రభుత్వ మెడలు వంచి హక్కులు సాధించుకుందామని పిలుపునిచ్చారు.

## రేవంత్ వల్లే ఆర్టీసీ డ్రైవర్ మృతి: హరీశ్ రావు



హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): వరంగల్ జిల్లా నర్సంపేట డిపో ఎదుట నిన్న ఆత్మహత్యా ప్రయత్నం చేసిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్, 80 శాతం గాయాలతో ఈ తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన శంకర్ గౌడ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయింది. ఆయన మృతితో రాష్ట్రంలో విషాదం నెలకొంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రేవంత్ రెడ్డి విఫలమయ్యారని మండిపడ్డారు. ప్రభుత్వ అలసత్వం వల్లే శంకర్ గౌడ్ ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. శంకర్ గౌడ్ అమరుడైన రోజును 'అప్పాయింటెడ్ డే'గా ప్రకటించి ఆయన త్యాగాన్ని గౌరవించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు హక్కుల కోసం కలిసికట్టుగా పోరాడాలి తప్ప, ఎవరూ ఇలాంటి ప్రాణత్యాగాలకు పాల్పడవద్దని, బీఆర్‌ఎస్ పార్టీ కార్మికులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన మృతదేహాన్ని ప్రస్తుతం స్వస్థలానికి తరలిస్తున్నారు. ఇవాళ జరిగే అంత్యక్రియలకు భారీ సంఖ్యలో కార్మికులు, రాజకీయ నాయకులు హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో వరంగల్, నర్సంపేట పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు.

**మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

**సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.**

## రోడ్డుపై 'డీఆర్‌ఎస్' ఉండదు: సజ్జనార్

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): రోడ్డు మీద నిర్లక్ష్యంగా డ్రైవ్ చేస్తూ మీ వికెట్ పారేసుకుంటే మీరు పర్మినెంట్‌గా పైకి వెళతారని, క్రికెట్‌లో ఉన్నట్లు డీఆర్‌ఎస్ సిస్టం ఉండదని హైదరాబాద్ సీపీ సజ్జనార్ చమత్కరించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. "మీరు చూసే ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్)లో డీఆర్‌ఎస్ (డెసిషన్ రివ్యూ సిస్టమ్) ఉంటుంది కానీ యమధర్మరాజు వద్ద మాత్రం డీఆర్‌ఎస్ (డెత్ రివ్యూ సిస్టం) ఉండదు" అని పేర్కొన్నారు. క్రికెట్ మైదానంలో వికెట్ పడితే ప్లేయర్ పెవిలియన్‌కి వెళ్తాడని, కానీ రోడ్డు మీద నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ మీ వికెట్ పారేసుకుంటే మాత్రం శాశ్వతంగా పైకి వెళతారని హెచ్చరించారు. క్రికెట్‌లో అంపైర్ నిర్ణయంపై రివ్యూ అడిగే అవకాశం ఉంటుందని, కానీ రోడ్డుమీద ఇష్టారీతిన డ్రైవింగ్ చేస్తే డీఆర్‌ఎస్ అవకాశం ఉండదన్నారు.





## వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వెల్గటూర్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): రైతులకు ఉపశమనం కలిగించే దిశగా జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని పలు గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలు (ఐకేపీ సెంటర్లు) ప్రారంభమయ్యాయి. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర సీనియర్ నాయకుడు మద్దుల గోపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గూడ రాంరెడ్డి, మంజుల, కందికట్ల రాజేష్, బాలసాని మల్లేశం పాల్గొన్నారు. అదనంగా పలు గ్రామాల సర్పంచ్లు, గ్రామశాఖ అధ్యక్షులు, రైతులు, హమాలీలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు సౌకర్యవంతమైన వాతావరణంలో ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.



## భూ రీసర్వేల్లో వేగం పెరగాలి: బీఎస్ లత

ధర్మపురి, ఏప్రిల్ 24 (ఈవార్తలు): గ్రామ సభల ద్వారా రీ సర్వే పనులు వేగవంతం చేయాలని జిల్లా అదన పు కలెక్టర్ బిఎస్ లత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూసర్వే-రీ సర్వే సందర్భంగా శుక్రవారం ధర్మపురి మండలంలోని గాదె పెల్లి గ్రామాల్లో భూముల రీ-సర్వేకు సంబం ధించిన అవగాహన సదస్సు నిర్వహించారు. భూమి రీ- సర్వే చేయుటలో చట్టం పరిధిలో వున్నా సర్వే, హద్దులు,చట్టం 1923 గురించి, సర్వే కార్యక్రమాల గురించి, సర్వే చేసే పని విధానాల గురించి గ్రామ సభలో గాదెపెల్లి గ్రామాల రైతుల, గ్రామ ప్రజలకు అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, సర్వే, భూమి కొలతల అధికారి, ధర్మపురి తహశీల్దార్ ఎరుకొండ శ్రీనివాస్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ సంఘనబట్ల దినేష్,సర్పంచ్ అల్పట్ల సురేష్, మండల సర్వేయర్, మండల గిర్దావర్-1, ఆర్ఎలు, స్థానిక పంచాయితీ కార్యదర్శులు, సంబంధిత జిపివోలు, స్థానిక సర్పంచ్ లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పాలనఅధికారి, నూతనంగా అనుమతి పొందిన సర్వేయర్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.







నేడే ఈవార్తలు

**COMMERCIAL RATE CARD**

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines – Rs.450
(for each extra line – Rs.90)

COLOUR:
Price for 5 Lines – Rs.500
(for each extra line – Rs.100)

Phone: +91 94404 55811 Email: contact@evarthalu.com


# రైతు భరోసా ప్రకటనలకే పరిమితం

## బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి ధ్వజం



జగిత్యాల బ్యూరో, ఏప్రిల్ 24 (ఈవార్తలు): రైతుభరోసా పథకం కేవలం ప్రకటనలకే పరిమితమైందని, ప్రభుత్వం వెంటనే రైతులకు భరోసా అందించి ఆదుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం రాయికల్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.15 వేల వాగ్దానం చేసి, ఇప్పుడు రైతుభరోసాను కేవలం రెండెకరాలకు పరిమితం చేసిందని ఆరోపించారు. గతంలో వరి, మొక్కజొన్నలను ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేశారని, ఇప్పుడు మొక్కజొన్న కొనుగోళ్లను ఎకరాకు 25 క్వింటాళ్లకు పరిమితం చేసి, యాప్ నమోదు తప్పనిసరి చేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మద్దతు ధర రూ.2400 ఉన్నా, బయట మార్కెట్లో రూ.1800కే అమ్ముకోవాల్సి వస్తోందని, క్వింటాల్‌కు రూ.600 వరకు నష్టం వాటిల్లుతోందన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడం లేదని, రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని జీవన్ రెడ్డి విమర్శించారు. రుణమాఫీ ఆశించిన స్థాయిలో జరగలేదని, రైతులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేకపోయిందని మండిపడ్డారు. పీఏసీఎస్ (సొసైటీలు) కాలపరిమితి ముగిసి ఏడాది దాటిపోయినా ఎన్నికలు నిర్వహించకపోవడం దురదృష్టకరమన్నారు. ధాన్యం సేకరణ, ఎరువుల పంపిణీ వంటి కీలక వ్యవహారాలను పర్యవేక్షించే సంస్థలు లేకపోవడం రైతాంగానికి నష్టం కలిగిస్తోందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే నామినేషన్లకు బదులుగా పాత విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.



## కొనుగోళ్ల ఆలస్యంతో రైతులకు దెబ్బ: దావ వసంత

సారంగపూర్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల పర్యటనలో భాగంగా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ మండల కేంద్రంలోని వరి ధాన్య కుప్పలను రైతులతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇటీవల కురిసిన పడగళ్ల వర్షంతో తడిసిన ధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి కొనుగోళ్లు సజావుగా జరగాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగులు, రవాణా, హమాలీల కొరత లేకుండా చూడాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వారంలోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని కోరారు. అదేవిధంగా, ఈ పంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## హిందూ సమ్మేళనానికి భోగ శ్రావణికి ఆహ్వానం

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని కృష్ణానగర్ బస్తి హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న హిందూ సమ్మేళనం ఆధ్యాత్మిక మహోత్సవ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకురాలు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డా. బోగ శ్రావణిని సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు ఆకుబత్తిని శ్రీనివాస్, అనుమల్ల శ్యామ్, చౌటపల్లి నారాయణ, మ్యాన సాయి వరుణ్ తదితరులు ఆమెకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమం విజయవంతం కావాలని వారు ఆకాంక్షించారు.



## అన్నవరం ఆలయ ధర్మకర్తల ప్రమాణం

కాకినాడ, ఏప్రిల్ 24 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో నూతనంగా నియమితులైన ధర్మకర్తలు, పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం అన్నవరం కొండపై ఘనంగా జరిగింది. నూతన పలక మండలి సభ్యుడు జనసేన పార్టీ పిఠాపురానికి చెందిన తోలేటి శిరీష ధర్మకర్తగా, ఇన్వైట్ మెంబర్‌గా గంజి గోవిందరాజు ఎన్నికయ్యారు. ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో ఉన్న ఈ పుణ్యక్షేత్రంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవంలో కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు పాల్గొని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ధర్మకర్తలు, పాలకమండలి సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, పారదర్శక పరిపాలన కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం శిరీష మాట్లాడుతూ.. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జనసేన వీర మహిళలను ఎప్పుడూ మర్చిపోరని, పార్టీలో కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, మార్కెట్ కమిటీ చైర్మన్ కార్పొరేషన్ డైరెక్టర్లు, ఆలయ అధికారులు, జనసేన పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు భారీగా పాల్గొన్నారు.



## జగిత్యాలలో ప్రశాంతంగా కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవమైంది. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో నలుగురు కోఆప్షన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీరబత్తిని పద్మజ, గట్టు సతీష్, తస్లీమ్ సుల్తానా, మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ ముజాహిద్ లు కోఆప్షన్ సభ్యులుగా ఎన్నిక కాగా, వారికి ఎన్నికల అధికారి ధృవీకరణపత్రాలను అందించారు. అనంతరం ఎన్నికైన కోఆప్షన్ సభ్యులను మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, వైస్ చైర్పర్సన్ జీనత్ పర్వీన్ మున్నా, కమిషనర్ స్పందన, కౌన్సిలర్లు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



## కో-ఆప్షన్ విజేతలకు జ్యోతి లక్ష్మణ్ సన్మానం

జగిత్యాల మున్సిపాలిటీలో జరిగిన కో-ఆప్షన్ ఎన్నికల్లో విజయం సాధించిన సభ్యులను మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కో-ఆప్షన్ సభ్యులు వీరబత్తిని పద్మజ, గట్టు సతీష్, తస్లీమ్ సుల్తానా, మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ ముజాహిద్ ను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కొత్తగా ఎన్నికైన సభ్యులు ప్రజలకు సేవచేసే దిశగా కృషి చేసి, మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. పట్టణ అభివృద్ధి కోసం అందరూ కలిసి సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు పాల్గొని నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## జగిత్యాలలో పారిశుద్ధ్యానికి భారీ నిధులు

**మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్**



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 24 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తున్నామని, సీజనల్ వ్యాధుల ప్రబలకుండా చర్యలు తీసుకుంటామని జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చైర్పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలో రాబోవు వర్ష కాలం దృష్ట్యా పట్టణ పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, కెమికల్స్, ఫాగింగ్ మెషిన్స్, బ్యాక్ హో లోడర్, బ్యాటరీ స్ప్రే మిషన్స్, వేహికిల్ మౌంటెడ్ ఫాగింగ్ మిషన్ల కొనుగోలుకు రూ. 0.90 కోట్లు నిధులు, బక్రీద్ పండుగ ఏర్పాట్లకు నిధులు 10.06 కోట్లు, జంక్షన్ ఫౌంటెన్ మరమ్మత్తులు, రోటరీ పార్క్ లో ఫౌంటేన్, పార్కు అభివృద్ధి పనులకు నిధులు రూ.0.19 కోట్లు, ప్రస్తుత వేసవి కాలము దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా లీకేజిలను త్వరితగతిన అరికట్టడానికి నిధులు, పారిశుధ్య వాహనాలకు మైక్స్ ఏర్పాటు, పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ, లీకేజిలను రిపేర్ చేయడానికి కౌన్సిల్లో తీర్మాణించి ఆమోదించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో (25) అజెండా అంశాలు ప్రవేశ పెట్టగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. పలువురు సభ్యులు పలు సమస్యలను చైర్పర్సన్ దృష్టికి తీసుకరాగా ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను చైర్పర్సన్ ఆదేశించారు. ఈ సమావేశంలో వైస్ చైర్పర్సన్ జీనత్ పర్వీన్ మునీరొద్దీన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మునిసిపల్ కమీషనర్ హెచ్ఎం. స్పందన, మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీయర్లు అనిల్, లక్ష్మి, టి.పి.ఓ. శ్రీనివాస్, టి.పి.ఎస్. అశోక్, జె.ఏ.ఓ. గణేష్ మునిసిపల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లిలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక



మెట్‌పల్లి, ఏప్రిల్ 24 (ఈవార్తలు): మెట్‌పల్లి మున్సిపాలిటీలో శుక్రవారం కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో కో-ఆప్షన్ సభ్యులుగా గజం లక్ష్మి, పన్నాల మాధవరెడ్డి, ఎం.డి. షాద్మానాజ్ ఎన్నికయ్యారు. కాగా, మరో అభ్యర్థికి తగిన మెజారిటీ రాకపోవడంతో ఆ ఒక్క స్థానానికి ఎన్నికను రద్దు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో వీరు చురుకైన పాత్ర పోషించాలని వారు ఆకాంక్షించారు.

# మీడియా అక్రిడిటేషన్ కమిటీతో కలెక్టర్ సమీక్ష



జగిత్యాల బ్యూరో, ఏప్రిల్ 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో శుక్రవారం నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన డిస్ట్రిక్ట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అర్హులైన వారికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, జి.ఓ. 252 ప్రకారం నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. మీడియా ప్రతినిధులు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్న కలెక్టర్, కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించి మీడియాపై ప్రజల నమ్మకాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. అక్రిడిటేషన్ ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు కమిటీ సభ్యులు చీటీ శ్రీనివాసరావు, పి.ఎస్. రంగారావు తమ అనుభవాలను పంచుకుని, ప్రక్రియ పారదర్శకత కోసం పలు సూచనలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు కలెక్టర్‌ను శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఈ సమావేశంలో డీపీఆర్ఓ నరేష్, డీఎంఏసీ కమిటీ సభ్యులు చీటీ శ్రీనివాసరావు, గంగుల రామ్ గోపాల్, ద్యావర సంజీవరాజు, పి.ఎస్. రంగారావు, అబ్దుల్ ముజాహిద్ ఆదిల్, కర్నే సంతోష్, బి. సదాశివకుమార్, దొమ్మటి అంజు గౌడ్, వి. ప్రవీణ్ కుమార్, ఎస్. వేణుగోపాల్, కల్పన, విష్ణు తదితరులు, డీపీఆర్ఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కెట్లకు బ్లడ్ బాత్

**స్టాక్ మార్కెట్లు భారీగా పతనం**
**ఐటీ రంగ షేర్లకు అత్యధికంగా నష్టం**



ముంబై: అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమనడంతో శుక్రవారం భారత స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలతో ముగిశాయి. అమెరికా-ఇరాన్ చర్చలు నిలిచిపోవడం, హర్మూజ్ జలసంధిలో సరఫరాకు అంతరాయం కలగడం వంటి భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ఫలితంగా, బీఎస్ఈ సెన్సెక్స్ 982.71 పాయింట్లు నష్టపోయి 76,681.29 వద్ద ముగిసింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 275.10 పాయింట్లు పతనమై కీలకమైన 24,000 మార్కు దిగువన 23,897.95 వద్ద స్థిరపడింది. ప్రధానంగా ఐటీ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి మార్కెట్లను కుంగదీసింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 5 శాతం మేర పడిపోయింది. ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా వంటి దిగ్గజ షేర్లు భారీగా నష్టపోయాయి. ఐటీతో పాటు ఫార్మా, మీడియా రంగ సూచీలు కూడా నష్టాల్లో ముగిశాయి. అయితే, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ మాత్రం స్వల్ప నష్టాలతో మిగతా రంగాలతో పోలిస్తే నిలకడగా కనిపించింది. బ్రాడర్ మార్కెట్లలోనూ ఇదే ట్రెండ్ కొనసాగింది. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు దాదాపు ఒక శాతం మేర నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును దాటి, 2.07 శాతం పెరిగి 107.25 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. చమురు ధరల పెరుగుదల ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని, ఇది దేశ కరెంట్ ఖాతా లోటును పెంచుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెక్నికల్ పరంగా, నిఫ్టీకి 24,000 స్థాయి బలమైన నిరోధకంగా మారిందని, ఒకవేళ సూచీ 23,800 స్థాయిని కోల్పోతే 23,600 వరకు పడిపోయే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# 14 నిమిషాలకో కారు తయారీ!

**మారుతి సుజుకి రికార్డు**

**2025-26లో 23.4 లక్షల కార్లు ఉత్పత్తి**




న్యూఢిల్లీ: భారత ఆటోమొబైల్ రంగంలో అగ్రగామిగా ఉన్న మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ సరికొత్త సంచలనం సృష్టించింది. సగటున ప్రతి 14 నిమిషాలకు ఒక కారును ఉత్పత్తి చేస్తూ అసాధారణ రికార్డును నెలకొల్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఏకంగా 23.4 లక్షల కార్లను తయారు చేసింది. ఇది మారుతి సుజుకి చరిత్రలోనే కాకుండా, భారతదేశంలో ఏ ఒక్క ఆటోమొబైల్ తయారీ కంపెనీ కూడా ఇప్పటివరకు నమోదు చేయని అత్యధిక వార్షిక ఉత్పత్తి. ఈ ఆర్థిక సంవత్సరంలో డిజైర్, ఫ్రాంక్స్, స్విఫ్ట్, ఎర్టిగా, బాలెనో మోడల్స్ అత్యధికంగా ఉత్పత్తి అయ్యాయి. ఈ ఐదు మోడళ్లలో ప్రతి ఒక్కటీ 2 లక్షలకు పైగా యూనిట్లుగా తయారయ్యాయి. సుజుకి మోటార్ కార్పొరేషన్‌కు చెందిన ప్రపంచవ్యాప్త తయారీ కేంద్రాలలో కూడా ఈ స్థాయి ఉత్పత్తిని సాధించిన ఏకైక కంపెనీగా మారుతి సుజుకి నిలిచింది. ఈ అపూర్వ విజయంపై మారుతి సుజుకి ఎండీ, సీఈఓ హిసాషి తకేయుచి స్పందించారు. "ఒకే దేశంలో ఇంత పెద్ద సంఖ్యలో వాహనాలు తయారు చేయడం గర్వకారణం. నాలుగున్నర దశాబ్దాలుగా మేం నిర్మించిన ఆటోమొబైల్ పర్యావరణ వ్యవస్థ, మా ఉద్యోగులు, భాగస్వాముల సమష్టి కృషి, ప్రభుత్వం తెచ్చిన జీఎస్టీ 2.0 వంటి విధానాల వల్లే ఇది సాధ్యమైంది" అని ఆయన వివరించారు. భవిష్యత్తులో ఉత్పత్తి సామర్థ్యాన్ని సుమారు 40 లక్షల యూనిట్లకు పెంచాలని, భారతదేశాన్ని కీలకమైన ఎగుమతి హబ్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తకేయుచి తెలిపారు. ఈ విజయం మారుతి సుజుకి పటిష్ఠమైన సరఫరా వ్యవస్థ, డీలర్ నెట్‌వర్క్‌కు నిదర్శనంగా నిలుస్తోంది.

# మే 4 తర్వాత టీఎంసీ గూండాలు ఖతం: మోదీ

కోల్‌కతా: మే 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీ గూండాలకు దాక్కోవడానికి బెంగాల్‌లో ఎక్కడా చోటు దొరకదని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. రెండో దశ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్ తొలి దశ పోలింగ్‌లో పెద్ద ఎత్తున ఓటర్లు పాల్గొన్నారని, ఇది ప్రజాస్వామ్య విజయంగా ఆయన అభివర్ణించారు. ఈ ఓటింగ్ శాతాన్ని చూసి టీఎంసీకి భయం పట్టుకుందని అన్నారు.

ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర ప్రజలకు జరిగిన ప్రతి అన్యాయానికి, దౌర్జన్యానికి సంబంధించిన ఫైల్స్‌ను బయటకు తీస్తామని హెచ్చరించారు. ఈ రాష్ట్రం విప్లవాల గడ్డ అని గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత టీఎంసీ గూండాలను ఎవరూ కాపాడలేరని అన్నారు. మమతా బెనర్జీ సాగిస్తున్న అటవిక పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అన్నారు. మొదటి దశలో పోలింగ్ రికార్డు స్థాయిలో నమోదు కావడం పట్ల మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ మహిళా వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. బెంగాల్‌లో మహిళలకు గౌరవం, భద్రత, సాధికారత కల్పించడమే తమ లక్ష్యమని అన్నారు.

### హుగ్లీ నదిలో మోదీ పడవ ప్రయాణం

ప్రధానమంత్రి మోదీ శుక్రవారం ఉదయం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో పడవ ప్రయాణం చేశారు. పడవ నడిపేవారితో, మార్నింగ్ వాక్ చేసే వారితో ఆయన కాసేపు ముచ్చటించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఆయన సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. హుగ్లీ నదిలో బోట్ రైడ్ చేసిన మోదీ, కెమెరా చేతబట్టి నది అందాలను క్లిక్‌మనిపించారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతిలో ముడిపడి ఉందని మోదీ పేర్కొన్నారు. బెంగాలీల జీవితాల్లో గంగానదికి ప్రత్యేక స్థానం ఉందని, దాని జలాలు ఒక ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకు వెళ్తున్నాయని పేర్కొన్నారు. ఈరోజు ఉదయం కొద్దిసేపు హుగ్లీ నది తీరంలో గడిపినట్లు పేర్కొన్నారు. పడవ నడిపే వారితో, ఉదయపు నడకకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. పడవ నడిపేవారి శ్రామిక శక్తిని మోదీ ప్రశంసించారు. ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే తమ ప్రభుత్వం పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సు కోసం కృషి చేస్తుందని అన్నారు. హుగ్లీ నది ఒడ్డున తాను వెచ్చించిన సమయం చాలా ప్రత్యేకమైనదని మోదీ మరో పోస్టులో పేర్కొన్నారు. చారిత్రాత్మక విద్యాసాగర సేతు, హౌరా వంతెనను దగ్గరగా చూడటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు



# బెంగాల్‌లో ఓటింగ్ శాతం గుడ్

**సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వెల్లడి**



న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో మొదటి దశలో పోలింగ్ శాతం అత్యధికంగా నమోదు కావడంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హర్షం వ్యక్తం చేశారు. భారత పౌరుడిగా బెంగాల్‌లో జరిగిన ఓటింగ్ శాతాన్ని చూసి చాలా సంతోషించానని వ్యాఖ్యానించారు. బెంగాల్ మొదటి దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అలాగే అత్యధిక పోలింగ్ శాతం నమోదైంది. శుక్రవారం 'ఎస్ఐఆర్' కేసు విచారణ సందర్భంగా పోలింగ్ శాతంపై సుప్రీంకోర్టు స్పందించింది. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంపై ప్రశంసలు కురిపించింది. ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించడం, ప్రజలు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి ఓటు వేయడం చాలా ఆనందంగా ఉందని పేర్కొంది. ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతమవుతుందని వ్యాఖ్యానించింది. ప్రజలు తమ ఓటుకు ఉన్న శక్తిని తెలుసుకుంటే ఎటువంటి హింసాత్మక ఘటనలకు పాల్పడబోరని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. కాగా, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పశ్చిమ బెంగాల్‌లో ఓటింగ్ శాతం ఈ స్థాయిలో నమోదు కావడం ఇదే మొదటిసారి అని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అన్నారు. బెంగాల్‌లో మొదటి దశలో 152 స్థానాలకు పోలింగ్ జరగగా, ఓటింగ్ శాతం 92 శాతం దాటింది. దక్షిణ్ దినాజ్‌పూర్, కూచ్ బెహార్, బీర్‌బుమ్ జిల్లాల్లో ఓటింగ్ శాతం 95 శాతానికి పైగా నమోదైంది.

# ఆప్‌కు అధికారం, డబ్బే ముఖ్యం

**ఆప్ నాయకత్వంపై అన్నా హజారే తీవ్ర విమర్శలు**



ముంబై: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో శుక్రవారం పెను రాజకీయ దుమారం రేగింది. ఇటీవలే డిప్యూటీ లీడర్ పదవి నుంచి తొలగించబడిన రాఘవ్ చద్దాతో సహా ఏకంగా ఏడుగురు రాజ్యసభ ఎంపీలు పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. తామంతా బీజేపీలో చేరుతున్నట్లు స్పష్టం చేయడంతో ఆప్ అధిష్ఠానం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. ఈ పరిణామంపై ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే స్పందిస్తూ, ఆప్ నాయకత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అధికారం, డబ్బుకే ఆప్ ప్రాధాన్యం ఇవ్వడమే ఈ పరిస్థితికి కారణమని ఆయన ఆరోపించారు. విలేకరులతో మాట్లాడిన అన్నా హజారే, పార్టీని వీడిన ఎంపీలు అంతర్గతంగా కొన్ని సమస్యలు ఎదుర్కొని ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. "ఏ నాయకుడైనా పార్టీని వీడితే, అది పార్టీ నాయకత్వం చేసిన తప్పే. ఆప్ సరిగ్గా పనిచేసి ఉంటే, దాని నాయకులు పార్టీని వీడి ఉండేవారు కాదు. స్వార్థం పెరిగినప్పుడు, మనుషులు తమ సిద్ధాంతాలను మరచిపోతారు" అని హజారే వ్యాఖ్యానించారు. "సమాజానికి, దేశానికి ప్రాధాన్యత ఇస్తూ పార్టీ పనిచేసి ఉంటే ఈ నాయకులు వెళ్లిపోయేవారు కాదు. కానీ వారు ఆ సూత్రాలను పక్కనపెట్టి అధికారం, డబ్బుపై దృష్టి పెట్టారు" అని ఆయన ఆరోపించారు. అదే సమయంలో, ప్రజాస్వామ్యంలో ఒక పార్టీని వీడాలా వద్దా అనేది వ్యక్తిగత హక్కు అని, ఎవరినీ బలవంతం చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, పార్టీ మారడంపై రాఘవ్ చద్దా మీడియా సమావేశంలో వివరణ ఇచ్చారు. రాజ్యసభలో ఆప్‌కు ఉన్న 10 మంది ఎంపీలలో ఏడుగురితో కలిసి బీజేపీ పార్లమెంటరీ వర్గంలో విలీనం కావడానికి గల కారణాలను ఆయన వెల్లడించారు. "నేను నా జీవితంలోని 15 సంవత్సరాలు అంకితం చేసిన ఆప్.. ఇప్పుడు నిజాయతీ రాజకీయాల నుంచి పక్కకు తప్పుకుంది. నేను తప్పుడు పార్టీలో ఉన్న సరైన వ్యక్తిని. అందుకే పార్టీకి దూరంగా, ప్రజలకు దగ్గరగా వెళున్నాను" అని చద్దా ఆవేదన వ్యక్తం చేశారు.

# మొజ్తబా ముఖానికి ప్లాస్టిక్ సర్జరీ..?

**తీవ్ర గాయాలతో అజ్ఞాతంలోనే ఇరాన్ సుప్రీం**

టెహ్రాన్: ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ బతికే ఉన్నారు, స్పృహలోనే ఉన్నారు. కానీ ఓ దాడిలో తీవ్రంగా గాయపడటంతో ఆయన ఇప్పుడు అజ్ఞాతంలోకి వెళ్లారు. బయటి ప్రపంచానికి కనిపించకుండా, వినిపించకుండా పాలనలో చురుగ్గా ఉన్నప్పటికీ, దేశంలో అధికారం ఆయన చేతుల్లో నుంచి సైనిక జనరల్స్ వైపు మళ్లింది. ఈ సంచలన విషయాలను 'ది న్యూయార్క్ టైమ్స్' తన ప్రత్యేక కథనంలో వెల్లడించింది. పత్రిక కథనం ప్రకారం మొజ్తబా ఖమేనీకి తీవ్ర గాయాలైనప్పటికీ, ఆయన మానసికంగా చాలా చురుగ్గా ఉన్నారు. అయితే, ఆయన శరీరం తీవ్రంగా దెబ్బతింది. ఆయన కాలికి మూడుసార్లు ఆపరేషన్ జరిగిందని, ప్రస్తుతం కృత్రిమ కాలు కోసం ఎదురుచూస్తున్నారని రిపోర్ట్ పేర్కొంది. ఒక చేతికి కూడా శస్త్రచికిత్స జరగ్గా, అది నెమ్మదిగా కోలుకుంటోంది. అన్నింటికంటే ముఖ్యంగా ముఖం, పెదవులు తీవ్రంగా కాలిపోవడంతో మాట్లాడటం కష్టంగా మారిందని, భవిష్యత్తులో ప్లాస్టిక్ సర్జరీ అవసరమని కథనం వివరించింది. ఈ గాయాల వల్లే ఆయన ప్రజా జీవితానికి దూరంగా ఉంటున్నారు. బలహీనంగా కనిపించడం ఇష్టం లేకే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.

ఆయనకు సందేశాలు చేరవేయడానికి, ఆయన నుంచి ఆదేశాలు స్వీకరించడానికి ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. చేతితో రాసిన లేఖలను సీల్డ్ కవర్లలో ఉంచి, కార్లు, మోటార్‌సైకిళ్లపై మానవహారంలా ఒకరి నుంచి ఒకరికి అందిస్తూ ఆయన రహస్య స్థావరానికి చేరవేస్తున్నారు. ఇజ్రాయెల్ తమను గుర్తించి దాడి చేయొచ్చనే భయంతో సీనియర్ అధికారులు కూడా ఆయన్ను కలవడం లేదని రిపోర్ట్ తెలిపింది. ఖమేనీకి కమ్యూనికేషన్ పరిమితం కావడంతో, దేశంలో అధికారం సైనిక జనరల్స్ చేతుల్లోకి వెళ్లింది. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కమాండర్లు ఇప్పుడు యుద్ధం, దౌత్యం, జాతీయ భద్రత వంటి కీలక అంశాలపై పూర్తి పట్టు సాధించారు. "మొజ్తబా ఒక బోర్డు డైరెక్టర్‌లా వ్యవహరిస్తుంటే, జనరల్స్ బోర్డు సభ్యులుగా మారి అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు" అని మాజీ అధ్యక్షుడు మహమూద్ అహ్మదీనెజాద్ సలహాదారు ఒకరు వ్యాఖ్యానించారు.

# నితీశ్ రాజకీయ జీవితం క్లోజ్: తేజస్వీ



పాట్నా: జేడీ(యూ) అధినేత నితీశ్ కుమార్‌ను రాజకీయంగా అంతం చేయాలనుకుని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ, ఆయనపై ఒత్తిడి తెచ్చి బీహార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయించిందని ఆర్జేడీ వర్కింగ్ ప్రెసిడెంట్ తేజస్వి యాదవ్ ఆరోపించారు. బీజేపీ నాయకుడు సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం తన బలాన్ని నిరూపించుకోవడానికి ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. విశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ మాట్లాడుతూ, నితీశ్ కుమార్‌తో బీజేపీ బలవంతంగా ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయించిందని ఆరోపించారు. 2030 వరకు బీహార్‌లో ఎన్డీయే నాయకుడిగా నితీశ్ కుమారే ఉంటారని బీజేపీ పలుమార్లు చెప్పిందని, కానీ ఇప్పుడు ఆయనను రాజకీయంగా అంతం చేసిందని మండిపడ్డారు. ఏ రాష్ట్రానికైనా రాజకీయ స్థిరత్వం అవసరమని, బీహార్‌లో అది కొరవడిందని అన్నారు. ఐదేళ్ళలో ఐదు ప్రభుత్వాలు మారాయని వ్యాఖ్యానించారు. నితీశ్ కుమార్‌ను తప్పిస్తారని తాము ముందే ఊహించామని అన్నారు. బీహార్ ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రిని బీజేపీ ఇప్పుడు తప్పించిందని ఆరోపించారు. సామ్రాట్ చౌదరి గతంలో ఆర్జేడీలో ఉన్నారని గుర్తు చేశారు. లాలూ ప్రసాద్ యాదవ్ శిష్యుడైన సామ్రాట్ ఎదుగుదలను చూసి తాను సంతోషిస్తున్నానని అన్నారు. ఆరెస్సెస్ మూలాలు కలిగి ఉండి, ఎదుగుదలను చూసి అసూయపడే వారి పట్ల సామ్రాట్ చౌదరి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామ్రాట్ చౌదరి ఎదుగుదలను బీజేపీ అనుబంధ సంస్థ నుంచి వచ్చిన కొంతమంది స్వాగతించకపోవచ్చని తేజస్వి యాదవ్ అన్నారు.

# మెటాలో మళ్లీ భారీ లేఆఫ్స్

**మే 20న 10 శాతం ఉద్యోగుల తొలగింపు**




న్యూయార్క్: సోషల్ మీడియా దిగ్గజం, ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా మరోసారి భారీ లేఆఫ్స్‌కు సిద్ధమైంది. మే 20న తమ ఉద్యోగుల్లో 10 శాతం మందిని, అంటే దాదాపు 8,000 మందిని తొలగించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీనితో పాటు, ప్రస్తుతం ఖాళీగా ఉన్న 6,000 పోస్టులను కూడా భర్తీ చేయబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు కంపెనీ చీఫ్ పీపుల్ ఆఫీసర్ జానెల్ గేల్ ఉద్యోగులకు ఒక మెమో పంపారు. వాస్తవానికి ఈ లేఆఫ్స్ ప్రణాళికకు సంబంధించిన వివరాలు మీడియాకు లీక్ కావడంతో, తాము ముందుగానే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నట్లు ఆమె తెలిపారు. కంపెనీని మరింత సమర్థవంతంగా నడపడం, ఇతర పెట్టుబడులను భర్తీ చేసుకోవడం కోసమే ఈ కఠిన నిర్ణయం తీసుకుంటున్నట్లు వివరించారు. తొలగింపునకు గురయ్యే ఉద్యోగులకు అండగా ఉంటామని, వారికి భారీ సెవరాన్స్ ప్యాకేజీ అందిస్తామని మెటా హామీ ఇచ్చింది. అమెరికాలోని ఉద్యోగులకు 16 వారాల బేసిక్ వేతనంతో పాటు, ప్రతి ఏడాది సర్వీస్‌కు రెండు వారాల చొప్పున అదనపు వేతనం, 18 నెలల పాటు ఆరోగ్య బీమా అందిస్తామని తెలిపింది. ఇతర దేశాల్లోని ఉద్యోగులకు కూడా అక్కడి నిబంధనల ప్రకారం ప్యాకేజీలు ఉంటాయని పేర్కొంది.

# ట్రంప్‌ను ఇండియాకు రప్పించండయ్యా!

**ముంబైలోని ఇరాన్ ఎంబసీ కౌంటర్ వీడియో**

ముంబై: చైనా, భారతదేశాలను నరకంతో పోలుస్తూ రేడియో హోస్ట్ మైఖేల్ సావేజ్ చేసిన వ్యాఖ్యల లేఖను రీపోస్ట్ చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై ముంబైలోని ఇరాన్ ఎంబసీ స్పందించింది. ట్రంప్ ఒకసారి భారత్ వచ్చి చూడాలని ఆ తర్వాత ఈ దేశం గురించి మాట్లాడాలని వ్యాఖ్యానించింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక వీడియోను పోస్టు చేసింది. భారతదేశంలోని అభివృద్ధి, సాంస్కృతిక విలువలు ట్రంప్‌నకు తెలిసేలా ఎవరైనా ఆయనను భారతదేశ పర్యటనకు తీసుకువస్తే బాగుండేదని పోస్టులో పేర్కొంది. ఈ వీడియోలో మహారాష్ట్రలోని అత్యాధునిక సదుపాయాలు, సంప్రదాయ వేడుకలు, పర్యాటక ప్రదేశాలకు సంబంధించిన వీడియోను షేర్ చేసింది. మహారాష్ట్రలోని అత్యంత ఎత్తైన భవంతులు, ఆధునిక రహదారులు, వినాయక నిమజ్జనంను ఈ వీడియోలో పొందుపరిచింది. ఇంకోవైపు, కొండలు, కోనలు, వాగులు, వంకలతో అద్భుతమైన సుందర ప్రదేశాలు ఉన్నాయని పేర్కొంది.

# నెతన్యాహుకు క్యాన్సర్

**ప్రారంభ దశలోనే గుర్తించానన్న ఇజ్రాయెల్ ప్రధాని**

**ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నట్లు వెల్లడి**



జెరూసలేం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తనకు ప్రోస్టేట్ క్యాన్సర్ సోకిందని, ప్రారంభ దశలో ఉన్నప్పుడే దానికి విజయవంతంగా చికిత్స తీసుకున్నానని అధికారికంగా వెల్లడించారు. ఇరాన్‌తో యుద్ధం జరుగుతున్నందున తన అనారోగ్య విషయాన్ని ఇంతకాలం గోప్యంగా ఉంచినట్లు శుక్రవారం ప్రకటించారు. ప్రస్తుతం తాను పూర్తి ఆరోగ్యంతో ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. ఏడాదిన్నర క్రితం ప్రోస్టేట్ గ్రంథి సమస్యకు శస్త్రచికిత్స చేయించుకున్నానని, అప్పటి నుంచి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటున్నానని నెతన్యాహు తెలిపారు. ఇటీవలి పరీక్షలో 0.9 సెం.మీ. పరిమాణంలో ఓ కణితిని గుర్తించారని, అది ప్రారంభ దశ క్యాన్సర్‌గా నిర్ధారణ అయిందని వివరించారు. అయితే అది ఇతర భాగాలకు వ్యాపించలేదని, వైద్యుల సలహా మేరకు రేడియేషన్ థెరపీ తీసుకున్నానని చెప్పారు. ఈ చికిత్సతో క్యాన్సర్ పూర్తిగా తొలగిపోయిందని వైద్య నివేదికలు ధృవీకరించినట్లు పేర్కొన్నారు. తన ఆరోగ్య సమస్యను ఆసరాగా తీసుకుని ఇరాన్ తప్పుడు ప్రచారం చేసే ప్రమాదం ఉందని, అందుకే యుద్ధ సమయంలో ఈ విషయాన్ని బయటపెట్టలేదని నెతన్యాహు వివరించారు. "వ్యక్తిగత, వృత్తి జీవితంలో ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించుకోవడం నాకు అలవాటు. ఈ విషయంలోనూ అదే చేశాను" అని ఆయన తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

# పంజాబీలకు బీజేపీ వెన్నుపోటు

**ఆపరేషన్ లోటస్‌తో కుట్రలు**
**పార్టీ వీడినవాళ్లు ద్రోహులు**
**రాఘవ్ చద్దా ప్రకటనపై ఆప్ ఫైర్**




న్యూఢిల్లీ: రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా నేతృత్వంలో ఏడుగురు పార్లమెంట్ సభ్యులు పార్టీని వీడటం ఆమ్ ఆద్మీ పార్టీలో (ఆప్) పెను దుమారం రేపింది. పార్టీ మారుతున్న వారిపై ఆప్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. వారిని 'ద్రోహులు'గా అభివర్ణిస్తూ, పంజాబ్ ప్రజలు ఈ వెన్నుపోటును ఎప్పటికీ మర్చిపోరని, క్షమించరని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారం వెనుక బీజేపీ హస్తం ఉందని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నుంచి పంజాబ్ సీఎం భగవంత్ మాన్ వరకు అందరూ ఆరోపించారు. "పంజాబీలకి బీజేపీ మరోసారి వెన్నుపోటు పొడిచింది" అని కేజ్రీవాల్ ఒకే వాక్యంలో తీవ్రంగా వ్యాఖ్యానించారు. రాజ్యసభలో ఆప్ నేత సంజయ్ సింగ్ మాట్లాడుతూ.. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల ముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో బీజేపీ 'ఆపరేషన్ లోటస్'ను అమలు చేసిందని సంచలన ఆరోపణలు చేశారు. పార్టీ మారిన ఎంపీలను 'ద్రోహులు'గా పేర్కొంటూ, "ఆమ్ ఆద్మీ పార్టీకి, పంజాబ్ ప్రజలకు ఎప్పుడు ద్రోహం జరిగినా, ప్రజలు దానికి తగిన బుద్ధి చెప్పారు. ఈ ద్రోహానికి, మోసానికి కూడా పంజాబ్ ప్రజలు సరైన సమాధానం ఇస్తారు" అని సంజయ్ సింగ్ అన్నారు. "పంజాబ్ రైతులకు వ్యతిరేకంగా మూడు వివాదాస్పద వ్యవసాయ చట్టాలు చేసిన పార్టీలో చేరి నిజాయతీ కోసం పోరాడతారా? రైతుల హత్య కేసులో నిందితుడిగా ఉన్న కేంద్ర మంత్రి కొడుకు ఉన్న పార్టీలోకి వెళతారా?" అని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఇది అత్యంత నీచమైన ద్రోహం, మోసం అని ఆప్ అధికార ప్రతినిధి అనురాగ్ దండా వ్యాఖ్యానించారు. మరోవైపు, ఆప్ పంజాబ్ యూనిట్ ప్రధాన కార్యదర్శి బల్తేజ్ పన్ను మాట్లాడుతూ... కేంద్ర ఏజెన్సీలను ఉపయోగించి ఆప్‌ను బలహీనపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ ప్రణాళికను అమలు చేయడానికి రాఘవ్ చద్దాను అమిత్ షా ఒక 'సాధనంగా' వాడుకున్నారని ఆయన పేర్కొన్నారు.

### పెరగనున్న బీజేపీ బలం

తాజా పరిణామంతో రాజ్యసభలో బీజేపీ బలం మరింత పెరగనుంది. ప్రస్తుతం బీజేపీ 106 మంది సభ్యులతో పెద్దల సభలో అతిపెద్ద పార్టీగా కొనసాగుతోంది. తాజాగా ఆప్ నుంచి ఏడుగురు ఎంపీల చేరికతో బీజేపీ బలం 113కి పెరగనుంది. అంతేకాదు, మిత్రపక్షాలతో కలిపి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి బలం 125కి చేరుతుంది. కొన్ని రోజుల క్రితమే రాఘవ్ చద్దాను రాజ్యసభలో పార్టీ డిప్యూటీ లీడర్ పదవి నుంచి ఆప్ అధిష్ఠానం తొలగించింది. ఆయన స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించింది. అయితే, ఇప్పుడు చద్దాతో పాటు ఆ కొత్త డిప్యూటీ లీడర్ అశోక్ మిట్టల్ కూడా బీజేపీలో చేరనుండడం గమనార్హం. పార్టీతో విభేదాల నేపథ్యంలో ఇటీవల చద్దా తన పార్లమెంటరీ పనితీరును వివరిస్తూ ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ తాజా పరిణామంతో ఆప్‌లో అంతర్గత సంక్షోభం తీవ్రస్థాయికి చేరినట్లు స్పష్టమవుతోంది.

ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
శనివారం 25-4-2026, జగిత్యాల | www.evarthalu.com



# చిరు-అనిల్ కపూర్ జోడీ ఉత్తిదే!



మెగాస్టార్ చిరంజీవి 158వ చిత్రం బాబీ కొల్లి దర్శకత్వంలో లాక్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్ర ఈప్రొడక్షన్ పనులు ముగింపు దశకు చేరుకోవడంతో త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ కి రెడీ అవుతోంది. అయితే సినిమాలో ప్రధాన నటీనటుల ఎంపిక ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. చిరంజీవి కి జోడీగా ఇద్దరు భామలు నటించాల్సి ఉంది. ఆ పాత్రలకు సంబంధించి ఎవరు నటిస్తున్నారు? అన్నది ఇంకా క్లారిటీ రాలేదు. మెగాస్టార్ వయసుకు తగ్గ భామల్ని దించాల్సి ఉంటుంది కాబట్టి ఆ విషయంలో కొంత జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ స్టార్ అనిల్ కపూర్ కూడా ఓ కీలక పాత్రలో లేదా పవర్‌ఫుల్ క్యామియోలో కనిపిస్తారంటూ కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని చిత్ర వర్గాలు క్లారిటీ ఇచ్చేసాయి. ఇదంతా తప్పుడు ప్రచారం అంటూ కొట్టిపారేసారు. అనిల్ కపూర్ మాత్రమే కాదు. ఈ ప్రాజెక్ట్ చుట్టూ అనేక ఊహాగానాలు చక్కర్లు కొడుతు న్నాయి. కొత్త నటులు సినిమాలో భాగమవుతున్నారనే ప్రచారం తొలి నుంచి జరుగుతోంది. కానీ అవన్నీ కేవలం రూమర్స్ మాత్రమేనని అనీల్ కపూర సహా ఎవరితో కూడా టీమ్ చర్చలు జరపలేదన్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. దర్శకుడు బాబీ స్క్రిప్ట్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పక్కా ప్లానింగ్‌తో ముందుకు సాగుతున్నాడు. బెంగాల్ నేపథ్యంలో తండ్రీకూతుళ్ల సెంటిమెంట్‌తో కూడిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉ ండబోతోందని తెలుస్తోంది. ఇప్పటికే సినిమాలో చిరంజీవి సరసన ఓ నాయికగా ప్రియమణి ఎంపికైనట్లు వార్తలొస్తున్నాయి. కానీ స్టోరీ డిమాండ్ం మేరకు మరో హీరోయిన్ కూడా అవసరమే. ఆ పాత్ర ఎంపిక ఇంకా పూర్తి కాలేదు. అలాగే చిరంజీవి కుమార్తె పాత్రలో ప్రీతి ముకుందన్ నటిస్తుందనే ప్రచారం సాగుతోంది. ఇందులోనూ క్లారిటీ లేదు.



# రకుల్-భగ్నానీ రిలేషన్ రచ్చ

తమ వివాహ బంధంపై భర్త జాకీ భగ్నానీ చేసిన 'సిట్యుయేషన్‌షిప్' వ్యాఖ్యలు నెట్టింట సంచలనంగా మారడంతో.. తాజాగా దీనిపై క్లారిటీ ఇచ్చింది హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్. 'గంటసేపు సాగిన సంభాషణలోని ఒక్క వాక్యం ఆశ్చర్యంగా ప్రధాన వార్తగా ఎలా మారిపోతుందో చూసి ఈరోజు మేమంతా చాలా నవ్వుకున్నాం. తమాషాగా అనిపిస్తుంది.. కానీ ప్రతీసారి ఇది కరెక్టు కాదు. మా బంధంలోని స్నేహాన్ని, స్వేచ్ఛను ఉద్దేశించి ఆయన ఆ పదాన్ని వాడారే తప్ప, ప్రచారంలో ఉన్నట్లుగా మరొకటి కాదు. ఒక విషయాన్ని కేవలం క్లిక్‌బైట్‌గా మార్చేయడం కంటే.. కొన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ తాము సృష్టించే కథనాల పట్ల మరికొంత బాధ్యత వహించాల్సిన సమయం ఆసన్నమైందేమో' అంటూ తెలిపింది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జాకీ భగ్నానీ.. తాము పెళ్లి చేసుకున్నప్పటికీ ఒక రకమైన 'సిట్యుయేషన్‌షిప్'లో ఉన్నామని, ఒకరికొకరు ఎంతో పారదర్శకంగా, స్వేచ్ఛగా ఉంటామని పేర్కొన్నారు. తమ మధ్య ఉండే నిజాయతీని సిట్యుయేషన్‌షిప్ అని పిలవడంతో నెట్టింట నెగిటివ్‌గా స్పందించడంతో క్లారిటీ ఇస్తూ ఫైర్ అయింది ఈ బ్యూటీ.




# త్రిష.. 100 కోట్ల ఆసామి

గత కొంతకాలంగా సీనియర్ హీరోయిన్స్ కు డిమాండ్ పెరుగుతోంది. ఐదేళ్ల క్రితం వరకు 30 దాటితే సపోర్టింగ్ రోల్స్ తో సర్దుకునే వారు. కానీ ప్రస్తుతం సీనియర్ భామలు 40కి దగ్గరవుతున్నా క్యారెక్టర్ కు తగ్గట్టుగా హీరోలకు జోడిగా కొనసాగుతున్నారు. ఆ లిస్టులో నయన్, త్రిష క్రేజే వేరు. ముఖ్యంగా ఇప్పుడు త్రిషకు ఉన్న డిమాండ్ మామూలుగా లేదు. హీరోయిన్‌గా రెండు దశాబ్దాలు దాటినా రెమ్యునరేషన్ తగ్గలేదు, డిమాండ్ ఆగలేదు. పైగా ఏజ్ పెరిగే కొద్దీ బ్యాంక్ బ్యాంక్ బ్యాలెన్స్ పెరుగుతోంది. లేటెస్ట్ గా త్రిష కృష్ణన్ నెట్ వర్త్ 85 కోట్లు దాటిందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇంకో రెండు సినిమాలు హిట్ అయితే 100 కోట్ల క్లబ్‌లోకి వెళ్లిపోతుందని తెలుస్తోంది. మరి ఈ 'సైలెంట్ సక్సెస్' వెనక అసలు ఫార్ములా ఏంటి అనే వివరాల్లోకి వెళితే.. 1999లో 'జోడి'తో ఎంట్రీ ఇచ్చినప్పుడు ఎవరూ ఊహించి ఉండరు, ఈ అమ్మాయి 2026లో కూడా కోట్లు తీసుకుంటూ లీడ్ రోల్స్ చేస్తుందని. వర్షం, ఘిల్లితో స్టార్ హీరోయిన్ గా మంచి క్రేజ్ అందుకుంది. మధ్య మధ్యలో అలా సక్సెస్ చూసిన అమ్మడు హీరోయిన్‌గా ఇక కష్టమే అనుకుంటున్న సమయంలో 96తో క్లాస్ ఆడియన్స్‌ని పట్టేసింది. కెరీర్‌లో గ్యాప్ వచ్చిన ప్రతిసారీ 'విన్నైతాండి వరువాయా', 'పొన్నియిన్ సెల్వన్' లాంటి సినిమాతో బౌన్స్ బ్యాక్ అయింది. అంటే ప్రతి ఐదేళ్లకు ఒకసారి తన మార్కెట్‌ని తనే రీసెట్ చేసుకుంటూ వచ్చింది. అందుకే 25 ఏళ్ల తర్వాత కూడా రేసులో ఉంది. ఇప్పుడు త్రిష ఒక్కో ప్రాజెక్ట్‌కి 10 కోట్ల రేంజ్ లో రెమ్యునరేషన్ తీసుకుంటోందని ఇండస్ట్రీ టాక్.



# పెద్ది ఐటం సాంగ్‌కు షరతులు!

తెలుగు సినిమా పరిశ్రమలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన వార్తల్లో ఒకటి పెద్ది సినిమాకు సంబంధించిన ఐటమ్ సాంగ్. ఈ చిత్రానికి సంబంధించిన ప్రధాన షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని సమాచారం. ఇక ఒక ఐటమ్ సాంగ్ పూర్తయితే సినిమా మొత్తం షూటింగ్ కంప్లీట్ అయినట్లేనని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ స్పెషల్ సాంగ్ కోసం చిత్రబృందం పలువురు హీరోయిన్ల పేర్లను పరిశీలించినట్లు సమాచారం. చివరికి ప్రముఖ నటి శృతిహాసన్ ను ఈ ప్రత్యేక గీతం కోసం సంప్రదించగా, ఆమె సంతోషంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. శృతిహాసన్ ఓకే చెప్పడంతో సాంగ్ షూటింగ్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా పూర్తవుతుందని మొదట యూనిట్ భావించినప్పటికీ, అక్కడే అసలు టెన్షన్ ప్రారంభమైనట్లు సమాచారం. ఈ స్పెషల్ సాంగ్‌లో నటించేందుకు ఆమె అంగీకరించినప్పటికీ, ఒక ముఖ్యమైన షరతు పెట్టినట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో చాలా పనులు ఉన్న నేపథ్యంలో ఈ నెలలోనే సాంగ్ షూటింగ్ పూర్తిచేయాలని శృతిహాసన్ సూచించినట్లు సమాచారం. దీంతో చిత్రబృందం రాత్రింబవళ్లు శ్రమిస్తూ ఈ పాట కోసం భారీ సెట్ పనులను వేగంగా పూర్తి చేసే ప్రయత్నాల్లో నిమగ్నమైందని తెలుస్తోంది.





# సమీరా రెడ్డి మళ్లీ మేకప్!

మెగాస్టార్ చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్ వంటి అగ్ర హీరోలతో నటించిన సమీరారెడ్డి పెళ్లి తర్వాత సినిమాలకు పూర్తిగా దూరమైంది. తాజాగా అందుతోన్న సమాచారం ప్రకారం సమీరా ఓ క్రేజీ ప్రాజెక్ట్ ద్వారా టాలీవుడ్‌లోకి గ్రాండ్ రీ-ఎంట్రీ ఇస్తోంది. సెకండ్ ఇన్నింగ్స్ కోసం ఓ స్టార్ హీరో సినిమాను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు ముగిశాని తెలిసింది. ఇందులో ఆమె ఓ కీలకమైన పాత్రలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిసింది. గతంలో కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్‌గా అలరించిన సమీరా ఇప్పుడు వయస్సు , అనుభవానికి తగ్గట్టుగా ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటుంది. ఈ సినిమా ఆమె కెరీర్‌లో ఓ మలుపుగా నిలుస్తుందని భావిస్తుంది. సినిమాలకు దూరంగా ఉన్న సమయంలో సమీరా రెడ్డి సోషల్ మీడియా ద్వారా అభిమానులకు నిరంతరం టచ్‌లోనే ఉంది. బాడీ పాజిటివిటీ, మాతృత్వం , ఫిట్‌నెస్ పై సమీరా పంచుకున్న వీడియోలు నెటిజన్లను ఎంతో ఆకట్టుకుంది. సెలబ్రిటీ హోదాను పక్కన పెట్టి వాస్తవ పరిస్థితులను ధైర్యంగా పంచుకోవడం తో ఆమెకు సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్ ఏర్పడింది. ఇప్పుడు నేరుగా వెండి తెరపై ఆమెను చూడబోతున్నామన్న వార్త అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. సాధారణంగా సీనియర్ హీరోయిన్లు రీ-ఎంట్రీ ఇస్తున్నప్పుడు ఎలాంటి పాత్రలు చేస్తారనే ఆసక్తి అందరిలోనూ ఉ ంటుంది. సమీరా రెడ్డి కూడా పేరు కోసం కాకుండా కథలో ప్రాముఖ్యత ఉన్న పాత్ర అయితేనే నటించాలని నిర్ణయిం చుకుం దిట. అందుకే ఓ స్టార్ హీరో ప్రాజెక్ట్ కావడంతో పాటు అందులో తన పాత్రకున్న వెయిటేజీని బట్టి ఓకే చెప్పినట్లు తెలుస్తోంది.

# అందుకే నో కిస్సింగ్ పాలసీకి బ్రేక్: కాజోల్

బాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకున్న కాజోల్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. దిల్ వాలే దుల్హనియా లే జాయేంగే సినిమాతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్న ఈమె.. ఆ తర్వాత కుచ్ కుచ్ హోతా హై సినిమాతో కమర్షియల్ విజయాన్ని అందుకుంది. కభీ ఖుషీ కభీ ఘం, ఫనా ఇలా ఎన్నో చిత్రాలు ఈమె కెరియర్ కు పునాది వేసాయి. పదహారేళ్లకే సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మ.. గత మూడు దశాబ్దాలుగా నో కిస్ పాలసీని అనుసరిస్తోంది. అయితే, 2023లో వచ్చిన 'ద ట్రయల్' వెబ్ సిరీస్ కోసం తన మూడు దశాబ్దాల నియమాలను పక్కనపెట్టి మరీ ఇందులో లిప్ లాక్ సన్నివేశాలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది.అసలు విషయంలోకి వెళ్తే.. తాజాగా ఒకవైపు హిందీలో సినిమాలు, వెబ్ సిరీస్ లు చేస్తూ దూసుకుపోతున్న కాజోల్ లిల్లీ సింగ్ నిర్వహించిన పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొని తన 30 సంవత్సరాలుగా పెట్టుకున్న నో కిస్సింగ్ పాలసీని బ్రేక్ చేయడంపై స్పందించింది. 'నిజం చెప్పాలి అంటే ద ట్రయల్ వెబ్ సిరీస్ లో నేను పోషించిన పాత్ర డిమాండ్ అలాంటిది. నయోనిక పాత్ర ఎలాంటి పరిస్థితుల్లో ఉంది. అసలు ఆ పాత్ర ఏం కోరుకుంటుంది అనేదానితో ఆ సీన్ కి చాలా సంబంధం ఉంది. అది కేవలం ముద్దు సీన్ మాత్రమే కాదు స్క్రీన్ ప్లే లో అంతర్భాగం కూడా.. ఇక ఆ సీన్ తీసేస్తే ఆ పాత్రలోని ఎమోషన్ పూర్తిగా దెబ్బతింటుంది. పైగా ఆ సీన్ లేకపోతే సినిమాకి సోల్ ఉండదు. అందుకే కాస్త ప్రొఫెషనల్ గా ఆలోచించి నా నియమాలను పక్కనపెట్టి ఇందులో నాతోటి నటుడిగా నటించిన జిషూ సేన్ గుప్తాతో నేను లిప్ లాక్ సీన్ చేయాల్సి వచ్చింది' అంటూ తెలిపింది కాజోల్.

ఈవార్తలు
క్రీడావాణి SPORTS
శనివారం 25-4-2026, జగిత్యాల
www.evarthalu.com





# కోహ్లీ గర్జన



## తోడుగా పడిక్కల్.. ఆర్సీబీ ఘన విజయం

### గుజరాత్ చిత్తు చిత్తు.. సుదర్శన్ సెంచరీ వృథా

**ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సొంతగడ్డపై అద్భుత విజయాన్ని నమోదు చేసింది. చిన్నస్వామి స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. గుజరాత్ నిర్దేశించిన 206 పరుగుల భారీ లక్ష్యాన్ని విరాట్ కోహ్లీ (81), దేవదత్ పడిక్కల్ (55) అద్భుత ఇన్నింగ్స్‌లతో మరో 7 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన పడిక్కల్‌తో కలిసి కోహ్లీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఈ జోడీ రెండో వికెట్‌కు కేవలం 59 బంతుల్లోనే 115 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసింది.**

ముఖ్యంగా పడిక్కల్ కేవలం 27 బంతుల్లో 2 ఫోర్లు, 6 భారీ సిక్సర్లతో విరుచుకుపడగా, కోహ్లీ 44 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో క్లాస్ ఇన్నింగ్స్ ఆడాడు. అయితే, వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔటవ్వడంతో మ్యాచ్ కాస్త ఉత్కంఠగా మారింది. ఈ దశలో కృనాల్ పాండ్యా (23), టిమ్ డేవిడ్ (10) సంయమనంతో ఆడి జట్టును విజయతీరాలకు చేర్చారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్, ఓపెనర్ సాయి సుదర్శన్ (58 బంతుల్లో 100) అద్భుత సెంచరీతో 20 ఓవర్లలో 3 వికెట్లకు 205 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (32) కూడా రాణించాడు. అయినప్పటికీ, కోహ్లీ, పడిక్కల్ మెరుపుల ముందు సుదర్శన్ శతకం వృథా అయింది.

#### చివరి ఓవర్ల వల్లే ఓడాం: గిల్

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠభరిత పోరులో గుజరాత్ టైటాన్స్ భారీ స్కోరు సాధించినప్పటికీ.. చివరకు ఆర్సీబీ చేతిలో పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది. మ్యాచ్ ముగిసిన అనంతరం గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తమ ఓటమికి గల కారణాలను తెలిపాడు. ఇన్నింగ్స్ మధ్యలో తాము మెరుగైన స్థితిలో ఉన్నామని.. కానీ కీలకమైన సమయాల్లో చేసిన కొన్ని తప్పిదాలు మ్యాచ్ ఫలితాన్ని మార్చేశాయని శుభ్‌మన్ గిల్ విచారం వ్యక్తం చేశాడు. గుజరాత్ ఇన్నింగ్స్ ముగింపు దశలో బ్యాటర్లు తడబడటం ఓటమికి ప్రధాన కారణమని గిల్ పేర్కొన్నాడు. ముఖ్యంగా 16వ ఓవర్ నుంచి 19వ ఓవర్ వరకు ఉన్న ఆ మూడు ఓవర్లు మ్యాచ్‌ను మలుపు తిప్పాయని ఆయన విశ్లేషించాడు. ఆ సమయంలో ఆశించిన స్థాయిలో బౌండరీలు రాకపోవడం వల్ల జట్టు స్కోరు 220 దాటాల్సిన చోట 205 దగ్గరే ఆగిపోయిందని, డెత్ ఓవర్లలో బ్యాటర్లు మరింత వేగంగా ఆడాల్సి ఉండేదని గిల్ అభిప్రాయపడ్డాడు. ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే విరాట్ కోహ్లీ ఇచ్చిన క్యాచ్‌ను వాషింగ్టన్ సుందర్ జారవిడవడంపై గిల్ స్పందిస్తూ.. అది ఆటలో ఒక భాగమైనప్పటికీ భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వచ్చిందని అన్నాడు. డకౌట్ కావాల్సిన బ్యాటర్ బతికిపోతే అది ఫీల్డర్‌పైనే కాకుండా బౌలర్ల ఆత్మవిశ్వాసంపై కూడా ప్రభావం చూపుతుందని తెలిపాడు. ఈ వికెట్‌పై నిర్దిష్టమైన లెంగ్త్ బంతులతో కట్టడి చేయడంలో తమ బౌలర్లు విఫలమయ్యారని, ఆర్సీబీ బ్యాటర్లు దానిని చక్కగా వాడుకున్నారని అంగీకరించాడు. ఈ మ్యాచ్‌లో అద్భుత సెంచరీతో మెరిసిన సాయి సుదర్శన్‌ను గిల్ మనస్ఫూర్తిగా అభినందించాడు. గత కొన్ని మ్యాచ్‌ల్లో తక్కువ స్కోర్లకే ఔట్ అయిన సాయి, ఈ మ్యాచ్‌లో తన కసిని ప్రదర్శిస్తూ జట్టును ఆదుకున్నాడని ప్రశంసించాడు. ఇదే క్రమంలో ఒక సరదా కామెంట్ చేస్తూ.. "సాయి అద్భుతంగా ఆడాడు, కానీ వచ్చే మ్యాచ్‌లో పవర్ ప్లే సమయంలో నాకు కూడా కొంచెం ఎక్కువ స్ట్రైక్ ఇస్తాడని కోరుకుంటున్నాను" అని నవ్వుతూ అన్నాడు. రన్ రేట్ నియంత్రణలో లేనప్పుడు స్పిన్నర్లను నమ్ముకున్నా ఫలితం దక్కలేదని గిల్ పేర్కొన్నాడు.

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| పంజాబ్ | 6 | 5 | 0 | 11 |
| బెంగళూరు | 7 | 5 | 2 | 10 |
| రాజస్థాన్ | 7 | 5 | 2 | 10 |
| హైదరాబాద్ | 7 | 4 | 3 | 8 |
| చెన్నై | 7 | 3 | 4 | 6 |
| ఢిల్లీ | 6 | 3 | 3 | 6 |
| గుజరాత్ | 7 | 3 | 3 | 6 |
| ముంబై | 7 | 2 | 5 | 4 |
| లక్నో | 7 | 2 | 5 | 4 |
| కోల్‌కతా | 7 | 1 | 5 | 3 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ- ఓడినవి పా- పాయింట్లు

## జాతీయ హాకీలో నౌషీన్ సత్తా

తోటి క్రీడాకారులు ఖరీదైన కిట్లతో శిక్షణ తీసుకుంటుంటే ఆమె మాత్రం అరువు తెచ్చుకున్న సామాగ్రితో సాధన చేస్తోంది. కనీసం ఒక మంచి హాకీ స్టిక్ కూడా కొనలేని నిరుపేద కుటుంబం ఆమెది. కానీ, 15 ఏళ్ల నౌషీన్ నాజ్ ఇప్పుడు భారత మహిళల హాకీ భవిష్యత్ ఆశాకిరణంగా వెలుగొందుతోంది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ యువ క్రీడాకారిణి, త్వరలో జపాన్‌లో జరగనున్న అండర్-18 ఆసియా కప్ జట్టులో స్థానం సంపాదించేందుకు అడుగు దూరంలో నిలిచింది. నౌషీన్ తండ్రి అఫ్ఫాజ్ ఖాన్ రోజుకు కేవలం రూ.250 సంపాదించే ఒక దినసరి కూలీ. భోపాల్‌కు 380 కిలోమీటర్ల దూరంలోని సియోని పట్టణంలో కనీసం పైకప్పు కూడా లేని ఓ అద్దె ఇంట్లో వారి నివాసం. నాలుగేళ్ల క్రితం పాత, విరిగిన హాకీ స్టిక్‌తో నౌషీన్ ప్రస్థానం మొదలైంది. "అది విరిగిపోయిన ప్రతీసారి గుడ్డతో కట్టుకుని ఆడేది తప్ప ఏరోజూ ఫిర్యాదు చేయలేదు" అని ఆమె తండ్రి గతాన్ని గుర్తుచేసుకున్నారు. 2023లో మధ్యప్రదేశ్ హాకీ అకాడమీ కంటపడటంతో ఆమె జీవితం మలుపు తిరిగింది. శిక్షణ, పౌష్టికాహారం, క్రీడా సామాగ్రి అన్నీ అకాడమీయే సమకూర్చింది. ఈ నెలలో బిహార్‌లోని రాజ్‌గిర్‌లో జరిగిన 16వ సబ్-జూనియర్ జాతీయ ఛాంపియన్‌షిప్‌లో నౌషీన్ సత్తా చాటింది. ఏకంగా 9 గోల్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలవడమే కాకుండా, 'ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్' అవార్డును కూడా గెలుచుకుంది. ఆట కోసం కూతురు వేసుకునే దుస్తులపై కొందరు విమర్శలు చేసినా, ఆమె తండ్రి అండగా నిలుస్తున్నారు. "నా కూతురిని ఎవరైనా ఆపాలని చూస్తే, ముందు నాతో తలపడాలి" అని ఆయన ధైర్యంగా చెబుతున్నారు. ఏడుగురు సంతానంలో ఒకరైన నౌషీన్ స్ఫూర్తితో ఆమె చెల్లెలు సబారికా కూడా అకాడమీలో చేరింది. "దేశం కోసం ఆడటమే నా ఏకైక లక్ష్యం" అని నౌషీన్ తన ఆశయాన్ని స్పష్టం చేసింది.



## సంజూ శశి థరూర్ ప్రశంసలు



ఐపీఎల్ లో నిన్న ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఘన విజయం సాధించింది. ముంబై వాంఖెడే మైదానం ఆతిథ్యమిచ్చిన ఈ మ్యాచ్‌లో సీఎస్కే ఆటగాడు సంజు శాంసన్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటి ఆడాడు. కేవలం 54 బంతుల్లో 101 పరుగులు చేసి ముంబై బౌలర్లను చిత్తు చేశాడు. మ్యాచ్ లో సంజూ చూపిన ప్రతిభపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ ఎక్స్ వేదికగా కవితా రూపంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

"సంజులో ఏదో ఉంది, గాలిలో ఒక సొగసు,
మణికట్టు కదలికతో, నిర్లక్ష్యపు చూపుతో.
టైమింగ్ సరిగ్గా కుదిరి బంతి వికెట్‌ను తాకినప్పుడు,
మనమందరం చేయాలని కోరుకునే పనులను అతను చేస్తాడు.
జైపూర్ మిరుమిట్లు గొలిపే వెలుగుల నుండి వాంఖేడే సూర్యుడి వరకు,
అతను ఒత్తిడిని పెంచి, ఆపై పరుగు లంకిస్తాడు.
అద్భుతమైన నైపుణ్యంతో చెక్కిన శతకం.
"చెపాక్" అయినా, "డర్బన్" అయినా, అతను ఆ నేలను తన ఆధీనంలోకి
తీసుకుంటాడు. బలవంతంగా బాదడం గానీ, కష్టపడటం గానీ లేదు,
కేవలం సునాయాసమైన గమనమే.
స్వచ్ఛమైన కాంతి రేఖలతో చిత్రించిన వంద పరుగులు.
ఆ మైలురాయిని చేరుకోవడానికి ఎంతకాలం వేచి ఉండాల్సి వచ్చినా,
సంజు సాధించే అద్భుతానికి సాటి మరొకటి లేదు
" అంటూ కవితాత్మక శైలిలో ట్వీట్ చేశారు.

## క్యాబ్‌లో గంగూలీ మార్క్ నిర్ణయాలు



సౌరవ్ గంగూలీ నేతృత్వంలోని బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. హెడ్ కోచ్, సపోర్ట్ స్టాఫ్ నియమకాల్లో పారదర్శకత తీసుకురావడానికి బెంగాల్ క్రికెట్ చారిత్రత్మక అడుగు వేసింది. సీనియర్ పురుషుల జట్టు హెడ్ కోచ్ లక్ష్మీ రతన్ శుక్లాతో క్యాబ్ తెగదెంపులు చేసుకుంది. అంతర్గతంగా జరిగే నియామకాలకు స్వస్తి పలికి, మెరిట్ ఆధారంగా కొత్త కోచ్‌లను ఎంపిక చేయాలని క్యాబ్ నిర్ణయించింది. ఇందుకోసం బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. బీసీసీఐ మాదిరిగానే ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేయనున్నారు. ఆసక్తిగల అభ్యర్థులు మే 1 సాయంత్రం 5 గంటలలోపు ధరఖాస్తు చేసుకోవచ్చు.

కోచ్ పదవికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు అర్హతులు ఇవే..

కనీసం 30 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లు లేదా 1 టెస్ట్, 30 వన్డేలు లేదా 45 టీ20లు ఆడి ఉండాలి

బీసీసీఐ లెవల్ 2 లేదా లెవల్ 3 కోచింగ్ సర్టిఫికేట్ తప్పనిసరి

ఒకవేళ ఆడిన అనుభవం లేకపోతే, సీనియర్ డొమెస్టిక్ జట్లు లేదా వయోపరిమితి జట్లకు 3 నుండి 5 ఏళ్ల పాటు కోచ్‌గా పనిచేసిన అనుభవం ఉండాలి.

దరఖాస్తుదారుల వయస్సు 60 ఏళ్ల లోపు ఉండాలి.

సీనియర్ పురుషుల జట్టు, మహిళల జట్టు, ఏజ్ గ్రూపు జట్లు(యూ-16, యూ-19, యూ-23) కోచ్ పదవులను భర్తీ చేయనున్నారు.



## కమిన్స్ ఎంట్రీ

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) అభిమానులకు శుభవార్త. జట్టు రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ తిరిగి జట్టుతో చేరాడు. శనివారం జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్‌తో జరగనున్న మ్యాచ్‌కు తాను అందుబాటులో ఉంటానని ధ్రువీకరించాడు. ఈ వార్తతో ఎస్‌ఆర్‌హెచ్ శిబిరంలో కొత్త ఉత్సాహం నెలకొంది. సీజన్ ప్రారంభానికి ముందే భారత్‌కు వచ్చినప్పటికీ, కమిన్స్ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో మ్యాచ్ తర్వాత వెన్ను గాయం స్కాన్ కోసం ఆస్ట్రేలియా వెళ్లాడు. శుక్రవారం జరిగిన ఫిట్‌నెస్ టెస్టులో ఉత్తీర్ణత సాధించడంతో, తిరిగి బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. "చాలా కాలం తర్వాత తిరిగి వస్తున్నా. రేపటి మ్యాచ్‌లో ఆడేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా" అని కమిన్స్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేశాడు. ఆస్ట్రేలియా టెస్ట్ కెప్టెన్ అయిన కమిన్స్, యాషెస్ సిరీస్ తర్వాత మరే అంతర్జాతీయ మ్యాచ్ ఆడలేదు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌నకు కూడా దూరమయ్యాడు. అతని స్థానంలో ఇప్పటిదాకా ఎస్‌ఆర్‌హెచ్ జట్టుకు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. అతని నాయకత్వంలో ఎస్‌ఆర్‌హెచ్ 7 మ్యాచ్‌లలో 4 గెలిచి, ం0.820 నెట్ రన్ రేట్‌తో పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. కమిన్స్ రాకతో, అతను తిరిగి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడు. అతని చేరికతో పేసర్ దిల్షాన్ మధుశంకపై వేటు పడే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో ఒకే మ్యాచ్ ఆడిన మధుశంక, 4 ఓవర్లలో 36 పరుగులిచ్చి ఒక వికెట్ తీశాడు. ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, ఎషాన్ మలింగ ఇతర విదేశీ ఆటగాళ్లుగా తుది జట్టులో కొనసాగనున్నారు.

## రోహిత్ రిటైర్మెంట్ తీసుకో: సెహ్వాగ్



ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులు, హిట్ మ్యాన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ అంశాలపై టీమిండియా మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో ముంబై చిత్తుగా ఓడిపోయిన తర్వాత, ఒక క్రీడా ఛానెల్‌తో మాట్లాడిన సెహ్వాగ్, హిట్ మ్యాన్ భవిష్యత్తుపై షాకింగ్ కామెంట్స్ చేశాడు. బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో గాయపడిన రోహిత్, ఇప్పటికే రెండు మ్యాచ్‌లకు దూరం కావడం ముంబై జట్టు సమతూకాన్ని దెబ్బతీసిందని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. రోహిత్ శర్మ ఫామ్ ఆందోళనకరంగా ఉందని, అభిమానులు ప్రశ్నించే పరిస్థితి రాకముందే అతడు తన రిటైర్మెంట్ గురించి ఆలోచించుకోవాలని సెహ్వాగ్ సూచించాడు. సరైన సమయంలో గౌరవప్రదంగా తప్పుకోవడం ఉత్తమమని తనదైన శైలిలో చెప్పాడు. ఇలాగే వరుస ఓటములు కొనసాగితే, ముంబై ఇండియన్స్ ప్లే-ఆఫ్స్ రేసు నుండి నిష్క్రమిస్తుందని హెచ్చరించాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై కూడా ఒత్తిడి పెరుగుతోందని, రోహిత్ గైర్హాజరీలో బ్యాటింగ్ ఆర్డర్ బలహీనంగా కనిపిస్తోందని విశ్లేషించాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శనివారం 25-4-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

# తెలంగాణం.. కొత్త గళం

తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై ఏప్రిల్ 25, 2026 ఒక సంచలన దినంగా మారనుంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యమ వేదికగా వెలిసిన 'తెలంగాణ జాగృతి'ని ఇప్పుడు 'స్వీయ రాజకీయ శక్తి'గా మలుస్తూ ఆమె తీసుకున్న నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేపుతోంది. తెలంగాణ ఆత్మగౌరవం, సాంస్కృతిక అస్తిత్వం ప్రాతిపదికన రెండు దశాబ్దాల క్రితం ఉద్యమ బాట పట్టిన కవిత, ఇప్పుడు తన తండ్రి కేసీఆర్ స్థాపించిన బీఆర్ఎస్ నుంచి వేరుపడి సొంత ముద్ర వేసేందుకు సిద్ధమయ్యారు. ఢిల్లీ ఎక్సైజ్ కేసు వంటి వ్యక్తిగత సవాళ్లను అధిగమించి, 'తెలంగాణ ఆడబిడ్డ'గా ప్రజల ముందుకు రావడం రాజకీయంగా సాహసోపేతమైన అడుగు. బీఆర్ఎస్ ఓటు బ్యాంకును, ముఖ్యంగా యువత, మహిళా ఓటర్లను కవిత లక్ష్యంగా చేసుకున్నారు. పార్టీలో తరం మారాలని, సీనియర్లకే పెద్దపీట వేయడం వల్ల యువ నాయకత్వం దెబ్బతింటోందని ఆమె చేస్తున్న విమర్శలు సొంత గూటికే ఇబ్బందికరంగా మారాయి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ వంటి ప్రధాన పార్టీలు ప్రజా సమస్యలను గాలికొదిలేశాయని విమర్శిస్తూ.. 'సర్వోదయ తెలంగాణ' (అందరి సంక్షేమం) నినాదంతో ఆమె మూడో ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే స్వరాష్ట్ర నినాదాలు ఇంకా పూర్తిస్థాయిలో నెరవేరలేదని, ఆ బాధ్యతను తన పార్టీ భుజానికెత్తుకుంటుందని ఆమె చెబుతున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లో 'ప్రొఫెసర్ జయశంకర్ సార్ ప్రాంగణం' పేరుతో ఏర్పాటు చేస్తున్న భారీ బహిరంగ సభ ద్వారా తన రాజకీయ సత్తా చాటబోతున్నారు. ఒకప్పుడు బతుకమ్మను విశ్వవ్యాప్తం చేసి సాంస్కృతిక విప్లవానికి నాంది పలికిన కవిత, ఇప్పుడు రాజకీయంగా ఎంతవరకు విజయవంతమవుతారనేది ఆసక్తికరం. అయితే, ఆమె పార్టీ వల్ల ప్రధానంగా బీఆర్ఎస్ ఓట్లు చీలిపోయే ప్రమాదం ఉందన్న విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్నాయి. రాష్ట్రంలో ప్రాంతీయ భావజాలం గల పార్టీలకు ఆదరణ ఉంటుందని నమ్ముతున్న కవిత, 2029 ఎన్నికలే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు.

# ఐపీఎస్‌ల బాధ ఎవరికెరుక?

"తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఐపీఎస్, ఐఏఎస్ అధికారుల బదిలీలు ఒక నిరంతర ప్రక్రియగా మారాయి. తాజాగా ఏప్రిల్ 2026లో కూడా 9 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే, ఈ వరుస స్థానచలనాలు కేవలం 'పరిపాలనా సౌలభ్యం' కోసమేనా? లేక వ్యవస్థాగత స్థిరత్వాన్ని దెబ్బతీసేలా ఉన్నాయా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది."






శశిధర్ అక్కెల

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన డిసెంబర్ 2023 నుంచి ఇప్పటివరకు ఐపీఎస్ అధికారుల బదిలీలు అనేకసార్లు జరిగాయి. ప్రధానంగా డిసెంబర్ 2023: అధికారం చేపట్టిన వెంటనే 20 మందికి పైగా ఐపీఎస్ అధికారుల తొలి విడత బదిలీ, ఫిబ్రవరి 2024లో 12 మంది ఐపీఎస్ అధికారుల మార్పు, జూన్ 2025లో సీనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీ, సెప్టెంబర్ 2025లో 23 మంది అధికారుల భారీ మార్పు, నవంబర్ 2025లో ఒకేసారి 32 మంది ఐపీఎస్ అధికారుల బదిలీ, జనవరి 2026లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 20 మంది డీసీపీల స్థాయి అధికారుల మార్పు, ఏప్రిల్ 2026లో 9 మంది అధికారులకు స్థానచలనం, శుక్రవారం 7గురికి బదిలీ. ఇలా.. గడిచిన రెండేళ్లలో ఐదు నుంచి ఆరు సార్లు భారీ స్థాయిలో ఐపీఎస్ బదిలీలు చోటుచేసుకున్నాయి. సగటున ఒక అధికారి తన పోస్టింగ్‌లో ఎనిమిది నెలలు కూడా గడపలేకపోతున్నారు. అధికారుల పదే పదే బదిలీలు సివిల్ సర్వీసెస్ వ్యవస్థలోని నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఒక ప్రాంతంలో శాంతి భద్రతలను అదుపులోకి తీసుకురావడానికి లేదా ఒక వ్యవస్థను అర్థం చేసుకోవడానికి అధికారులకు కనీస సమయం అవసరం. కానీ నెలల వ్యవధిలోనే మార్పులు చేయడం వల్ల దీర్ఘకాలిక ప్రణాళికలు కుంటుపడుతున్నాయి. బాధ్యత తీసుకునే లోపే బదిలీ అవ్వడం వల్ల వ్యవస్థపై పట్టు సడలుతోంది. యువ ఐపీఎస్ అధికారులకు క్షేత్రస్థాయిలో పనితీరు ప్రదర్శించే అవకాశం లేకపోతోంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం తన విధానాలకు అనుగుణంగా అధికారులను నియమించుకునే హక్కు కలిగి ఉంటుంది. అయితే, అది వ్యవస్థాగత విచ్ఛిన్నానికి దారితీయకూడదు. పదే పదే బదిలీలు చేయడం వల్ల అధికారుల్లో అభద్రతాభావం ఏర్పడటమే కాకుండా, ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న నమ్మకం కూడా సన్నగిల్లే ప్రమాదం ఉంది. పరిపాలనలో పారదర్శకత, స్థిరత్వం రావాలంటే అధికారులకు కనీస పదవీకాలం ఉండేలా ప్రభుత్వం నిర్ణయాలు ఉండాలి.





గంగాధర్ బొమ్మకంటి
ఈవార్తలు దినపత్రిక ఛైర్మన్

# పండ్ల రాజు.. వెల వెల

'పండ్ల రాజు'గా వెలుగొందే మామిడి ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో ఉంది. ఏటా వేల కోట్ల రూపాయల టర్నోవర్‌తో, లక్షలాది మంది రైతులకు ఉపాధినిచ్చే మామిడి తోటలు ఇప్పుడు వెలవెలబోతున్నాయి. ఒకవైపు భానుడి భగభగలు, మరోవైపు ఊహించని అకాల వర్షాలు వెరసి మామిడి దిగుబడిని దారుణంగా దెబ్బతీశాయి.

ఈ ఏడాది మార్కెట్‌లో మామిడి పండు సామాన్యుడికి 'అందని ద్రాక్ష'గా మారుతుండగా, పండించిన రైతుకు కన్నీళ్లే మిగులుతున్నాయి. మామిడి పంటకు వాతావరణమే ప్రాణాధారం. పూత దశ నుంచి కాయ పక్వానికి వచ్చే వరకు నిర్ణీత ఉష్ణోగ్రతలు ఉండాలి. కానీ, గత కొన్నేళ్లుగా వాతావరణ మార్పులు మామిడి సాగును అతలాకుతలం చేస్తున్నాయి. నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఉండాల్సిన చలి లేకపోవడం, ఆ సమయంలో కురిసిన అకాల వర్షాల వల్ల పూత మాడిపోయింది. తేమ పెరగడంతో 'బూడిద తెగులు' వంటి వ్యాధులు వ్యాపించి పూత రాలిపోయింది. కాయలు పిందె దశలో ఉన్నప్పుడు కురిసిన వడగళ్ల వానలు కోలుకోలేని దెబ్బ తీశాయి. దీనివల్ల కాయలపై మచ్చలు పడటం, నాణ్యత తగ్గడం వంటి సమస్యలు ఎదురయ్యాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఉష్ణోగ్రతలు 40-45 డిగ్రీలకు చేరడంతో కాయలు ఎదుగుదల ఆగిపోయి, ముందే రాలిపోతున్నాయి. వేడి గాలుల వల్ల కాయల్లోని తేమ తగ్గిపోయి 'స్పంజీ టిష్యూ' వంటి లోపాలు తలెత్తుతున్నాయి. మామిడి రైతుల కష్టాలు కేవలం ఈ ఏడాదివే కావు. గత ఐదేళ్లుగా వరుస సవాళ్లు ఈ రంగాన్ని కుదిపేస్తున్నాయి. ఒక ఏడాది దిగుబడి బాగుంటే, మరో ఏడాది తగ్గడం సహజం. కానీ, వాతావరణ మార్పుల వల్ల వరుసగా రెండేళ్లపాటు దిగుబడులు తగ్గడం రైతులను ఆర్థికంగా కుంగదీస్తోంది. పురుగు మందులు, ఎరువులు, కూలీల ఖర్చులు రెట్టింపయ్యాయి. దిగుబడి లేకున్నా తోటల నిర్వహణ కోసం ఎకరాకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. దళారీల వ్యవస్థ వల్ల రైతుకు దక్కే ధర కంటే వినియోగదారుడు కొనే ధర మూడు రెట్లు ఎక్కువగా ఉంటోంది. కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలు లేకపోవడం వల్ల రైతులు అందిన కాడికి అమ్ముకోవాల్సి వస్తోంది. ఈ సంక్షోభం నుంచి మామిడి రైతులను గట్టెక్కించాలంటే ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలి. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను గుర్తించి ఎకరాకు తగిన నష్టపరిహారం అందించాలి. ప్రస్తుతం ఉన్న పంట బీమా నిబంధనలను సవరించి, మామిడి సాగుకు అనుకూలంగా మార్చాలి. ప్రతి జిల్లాలో మామిడి కోసం ప్రత్యేక శీతల గిడ్డంగులను నిర్మించాలి. దీనివల్ల ధర తక్కువ ఉన్నప్పుడు రైతులు పంటను నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. మామిడి గుజ్జు, జ్యూస్, ఇతర విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ పరిశ్రమలను ప్రోత్సహించాలి. దీనివల్ల నాణ్యత తక్కువగా ఉన్న కాయలకు కూడా గిట్టుబాటు ధర దక్కుతుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మామిడిని పండించేలా రైతులకు శిక్షణ ఇవ్వాలి. 'వేపర్ హీట్ ట్రీట్‌మెంట్' ప్లాంట్లను అందుబాటులోకి తెచ్చి ఎగుమతులను సులభతరం చేయాలి. మారుతున్న వాతావరణాన్ని తట్టుకునే కొత్త రకాలను అభివృద్ధి చేయడంలో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు చొరవ చూపాలి. మామిడి కేవలం ఒక పండు మాత్రమే కాదు, అది వేల కుటుంబాల జీవనాధారం. 'బంగారు ఫలం'గా పేరున్న మామిడి ఇప్పుడు 'కన్నీటి ఫలం'గా మారుతుండటం ఆందోళనకరం. ప్రకృతి వైపరీత్యాలను మనం ఆపలేకపోవచ్చు, కానీ రైతుకు భరోసానిచ్చే వ్యవస్థలను బలోపేతం చేయవచ్చు. ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, మార్కెటింగ్ నిపుణులు కలిసికట్టుగా కృషి చేస్తేనే 'మామిడి' మళ్లీ తీయని ఫలితాలను ఇస్తుంది.

# ప్రజాస్వామ్య పోకడ



శ్రీకాంత్ చుక్క
నిజామాబాద్



తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో నమోదైన అనూహ్య పోలింగ్ శాతం, ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీల చీలిక వంటి పరిణామాలు భారత రాజకీయ ముఖచిత్రాన్ని వేగంగా మారుస్తున్నాయి. ఏప్రిల్ 2026లో జరిగిన ఈ పరిణామాలు కేవలం ఒక పార్టీ బలోపేతం లేదా బలహీనపడటాన్ని మాత్రమే కాకుండా, రాజ్యాంగపరమైన లొసుగులు, ప్రజాస్వామ్య చైతన్యాన్ని కూడా ప్రతిబింబిస్తున్నాయి. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తొలి విడతలో ఓటర్లు క్యూ కట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ స్థాయిలో ఓటింగ్ నమోదు కావడం ఇదే తొలిసారి అని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది.రెండు రాష్ట్రాల్లోనూ పురుషుల కంటే మహిళా ఓటర్లే అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ భారీ పోలింగ్ అధికార వ్యతిరేకతను సూచిస్తుందా లేక సంక్షేమ పథకాల పట్ల ఓటర్ల కృతజ్ఞతను చాటుతుందా అనేది మే 4న వెలువడే ఫలితాలతో స్పష్టమవుతుంది. మరోవైపు జాతీయ రాజకీయాల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా తనతో పాటు మరికొంతమంది ఎంపీలను కలుపుకొని బీజేపీలో విలీనం కావాలని నిర్ణయించుకున్నారు.

రాజ్యసభలో ఆప్‌కు ఉన్న 10 మంది ఎంపీల్లో ఏడుగురు (రెండు వంతుల మెజారిటీ) పార్టీని వీడటంతో, ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిపై అనర్హత వేటు పడకుండా 'విలీనం' అనే రాజ్యాంగ నిబంధనను వాడుకున్నారు. రాఘవ్ చద్దాతోపాటు హర్భజన్ సింగ్, స్వాతి మాలివాల్, సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్ వంటి ప్రముఖులు ఈ జాబితాలో ఉన్నారు. ఆప్ తన సిద్ధాంతాల నుండి పక్కకు పోయిందని, అవినీతి పార్టీగా మారిందని చద్దా ఆరోపించారు. అయితే బీజేపీ 'ఆపరేషన్ లోటస్' ద్వారా తమ నేతలను ప్రలోభపెడుతోందని కేజ్రీవాల్ ప్రభుత్వం విమర్శించింది. ఈ పరిణామాలు రాజ్యసభలో బీజేపీ బలాన్ని పెంచడమే కాకుండా, రాబోయే పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలపై తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. తమిళనాడు, బెంగాల్ ఎన్నికల ఫలితాలు జాతీయ కూటముల భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ఒకవైపు ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్ల భాగస్వామ్యం పెరుగుతుంటే, మరోవైపు పార్టీల విలీనాలు, ఫిరాయింపులు రాజకీయ స్థిరత్వంపై చర్చకు దారితీస్తున్నాయి. భారత రాజకీయాలు ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉన్నాయి. ఓటరు తీర్పు (పోలింగ్ శాతం), నేతల మార్పు (రాఘవ్ చద్దా ఉదంతం) రెండూ కలిసి దేశ రాజకీయ దిశను మార్చనున్నాయి.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.